ఈనాడు
అమరావతి
కృష్ణా
సోమవారం అక్టోబరు 21, 2024

హైదరాబాద్ విమాన సర్వీసు రద్దు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసు సాంకేతిక కారణాలతో ఆదివారం అర్ధంతరంగా రద్దయ్యింది. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 12:15 గంటలకు ఇక్కడికి చేరుకోవాల్సిన విమానం.. మధ్యాహ్నం 1:45 గంటలకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో సాంకేతిక సమస్య తలెత్తింది. పరిష్కారానికి విమానయాన సంస్థ అధికారులు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి సర్వీస్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో 110 మంది ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేయగా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

నిత్యం.. స్వచ్ఛం

ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో 'స్వచ్ఛతా హీ సేవ' వాక్‌థాన్ రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీనటుడు సుధీర్‌బాబు హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి రన్‌లో పాల్గొని ఉత్సాహపరిచారు.

– ఈనాడు, అమరావతి





గన్నవరం: స్వర్ణభారత్ ట్రస్టులో ఆదివారం నిర్వహించిన రైతునేస్తం పురస్కారాల కార్యక్రమంలో మహిళలను పలకరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. పక్కన యడ్లపల్లి వెంకటేశ్వరరావు

క్వారీ గుంతల్లో.. ఆశలు సమాధి

ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల దుర్మరణం

గన్నవరం గ్రామీణం, సొబ్బాల(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యను మరికొన్ని నెలల్లో పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించి తన కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండాలనేది ఆ యువకుల ఆశయం. తల్లిదండ్రులు కూడా తమ కుమారులు భవిష్యత్తులో అండగా ఉంటారని ఆశపడ్డారు. కానీ ఈత సరదా వారి ఆశలను జల సమాధి చేసింది. గన్నవరం పోలీసుల కథనం ప్రకారం..గన్నవరం మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ నాలుగో ఏడాది చదువుతున్న గంపలగూడెం మండలం సొబ్బాలకు చెందిన చెందిన పగడాల దుర్గాప్రసాద్(21), యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం రాజానగరం గ్రామానికి చెందిన జగ్గరాజు వెంకటేశ్‌రాజు (21), నందూరి సునాథ్, టి.అమర్‌నాథ్‌రెడ్డి, జగదీష్, బి.జీవన్, పి.లక్ష్మీనారాయణ, జి.యుగేందర్ కొండపావులూరులోని క్వారీ గుంతల వద్దకు వచ్చారు. వీరంతా హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. తొలుత అదే కళాశాలకు చెందిన ద్వితీయ ఏడాది విద్యార్థులు అక్కడికి చేరుకొని తిరిగి వెళ్లారు. లోతు లేదని వారు చెప్పడంతో నాలుగో ఏడాది విద్యార్థులు వచ్చారు. సరదాగా కొంత సమయం ఈతకొట్టారు. తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో వెంకటేశ్‌రాజు ప్రమాదవశాత్తు పెద్ద గోతిలో జారి పడ్డాడు. కాపాడేందుకు ప్రయత్నించిన దుర్గాప్రసాద్ కూడా నీళ్లలో మునిగాడు. అప్రమత్తమైన మిగిలిన విద్యార్థులు పోలీసులు, పక్కనే ఉన్న పదో బెటాలియన్ ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది వచ్చి క్వారీలో మునిగిన వెంకటేశ్‌రాజు, దుర్గాప్రసాద్‌ల మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈతకు వెళ్లి క్వారీ గుంతల్లో మునిగి చనిపోయాడన్న సమాచారం తెలుసుకున్న దర్గాప్రసాద్ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, ధనలక్ష్మిల రోదన వర్ణనాతీతంగా ఉంది.



విద్యార్థి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న బలగాలు



దుర్గాప్రసాద్ (పాతచిత్రం)

పద్మవ్యూహమైనా.. పటాపంచలే..!

ఈనాడు, అమరావతి





శనివారం ఉదయం.. 10.30 గంటల సమయం..
చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిలోని వారధిపై గుంటూరు వైపు మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఒక్కో వాహనం ముందుకు కదిలేందుకు చాలా సమయం పడుతోంది. ఎంతకూ ట్రాఫిక్ క్లియర్ కావడం లేదు. అక్కడ వరకు ట్రాఫిక్ చక్రబంధంలో పోలీసులు సైతం వెళ్లలేకపోయారు. ఈ పరిస్థితుల్లో పోలీసు ఉన్నతాధికారులు డ్రోన్ పంపించి ఆ దృశ్యాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా పరిశీలించారు. అక్కడ ఓ కారు బ్రేక్ డౌన్ అయినట్లు గుర్తించి ఆగమేఘాలపై క్రేన్‌ను తెప్పించి కారును అడ్డు తప్పించడంతో వాహనాలు సాఫీగా సాగాయి.

విజయవాడ నగరంలో ప్రజలకు ఎదురయ్యే ప్రధాన సమస్యల్లో ముఖ్యమైనది ట్రాఫిక్ ఇబ్బందులు. రద్దీ సమయాల్లో అయితే నగరం పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. ప్రధాన కూడళ్లలో చాంతాడంత ట్రాఫిక్ చికాకు పెడుతోంది. దీని పరిష్కారం కోసం విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు అత్యాధునిక డ్రోన్ల సాయం తీసుకుంటూ మంచి ఫలితాలు రాబడుతున్నారు. గతంలో నిరసనలు, ర్యాలీలు, బంద్‌లు, నిషేదాజ్ఞలు, ఉద్యమాల సమయాల్లో వీటిని విస్తృతంగా ఉపయోగించేవారు. ఈ సారి రియల్ టైమ్‌లో వినియోగించే యత్నంలో భాగంగా వాహనాల రద్దీ నియంత్రణకు వాడుతున్నారు.

4 ప్రాంతాల్లో..

గతంలో పోలీసుల వద్ద ఉన్న డ్రోన్లకు ప్రత్యక్ష ప్రసారం చేసే వెసులుబాటు లేదు. ఇటీవల కొత్తగా ఆధునిక సాంకేతిక హంగులు ఉన్న 85 డ్రోన్లను ప్రభుత్వం కొనుగోలు చేసి, అన్ని పోలీసు యూనిట్లకు అందజేసింది. ఒక్కో జిల్లాకు సగటున మూడు వరకు వచ్చాయి. విజయవాడ పోలీసు కమిషనరేట్‌కు వచ్చిన వాటిని నగర సీపీ ట్రాఫిక్ పరిశీలన, నియంత్రణకు వినియోగిస్తున్నారు. గత మూడు రోజులుగా ప్రయోగాత్మకంగా చేసిన యత్నం అనుకూల ఫలితాలను ఇచ్చింది. డ్రోన్లు చిత్రీకరించే దృశ్యాలను అప్పటికప్పుడు వాటిని ఆ యూట్యూబ్ అకౌంట్‌కు పంపించి దాని ద్వారా ప్రసారం చేస్తున్నారు. ఈ దృశ్యాలు కమాండ్ కంట్రోల్ కేంద్రంతో పాటు నగర పోలీసు ఉన్నతాధికారుల వాట్సాప్ గ్రూప్‌నకు లైవ్ లింక్‌లను పంపిస్తారు. వీటిపై క్లిక్ చేసి తమ మొబైళ్ల లోనే లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు చూస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు.

రద్దీ సమయాలైన.. ఉదయం 8 నుంచి 11 గంటలు.. సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు నగరంలోని వారధి, ప్రకాశం బ్యారేజీ, మహానాడు, రామవరప్పాడు కూడళ్లలో డ్రోన్లు ఎగరేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ భారీగా నిలుస్తోంది. అక్కడ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి ఎంతవరకు ఆగింది, ఎందుకు ఆగిందో తెలియని పరిస్థితి. ఈ సమస్యకు విరుగుడుగా.. డ్రోన్ పంపించి, దాని ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ద్వారా దృశ్యాలను పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సమయాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులతో బెజవాడ రోడ్లు కిక్కిరిసి ఉంటాయి. ఈ సమయంలోనే న్యాయమూర్తులు, మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. వీఐపీల వాహన శ్రేణులకు ఆటంకాలు లేకుండా చూస్తున్నారు.



- డ్రోన్లతో బెజవాడలో ట్రాఫిక్ సమస్యలకు చెక్
- లైవ్ స్ట్రీమింగ్‌తో రద్దీ నియంత్రణ, భద్రత పర్యవేక్షణ
- నగరంలో పోలీసుల ప్రయోగం విజయవంతం



30 నిమిషాలు

ఒక్కో డ్రోన్ నుంచి దాదాపు 30 నిమిషాల పాటు నిరంతరాయంగా ప్రత్యక్ష ప్రసారం ఇచ్చుకునే వీలుంది. ఆ తర్వాత బ్యాటరీలను మార్చి ఉపయోగించుకోవచ్చు. లైవ్ ఇచ్చే ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసారం కోసం 150 నుంచి 200 ఎంబీపీఎస్ వేగం కలిగిన అంతర్జాలం అవసరం. ఇంత వేగం ఉంటేనే చిత్రీకరించిన దృశ్యాలను ప్రత్యక్షంగా ప్రసారం చేయొచ్చు. దీని కోసం కీలకమైన ప్రాంతాల్లో సర్వీసు ప్రొవైడర్లతో మాట్లాడి రూటర్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా అంతర్జాలానికి కనెక్ట్ అయి లైవ్ ఇస్తున్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో విజయవంతం

ఇటీవల ముగిసిన అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు వీటిని నగర పోలీసులు పెద్ద ఎత్తున వినియోగించారు. మూడు డ్రోన్ల ద్వారా క్యూలైన్లలో భక్తుల రద్దీ, ఆలయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్, తదితర వాటిని ఎప్పటికప్పుడు లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పరిశీలించి నియంత్రించారు. వినాయక గుడి, మోడల్ అతిథిగృహం, అమ్మవారి ఆలయం, తదితర ప్రాంతాల్లో వీటిని మోహరించారు. వీటి దృశ్యాల ఆధారంగా పోలీసు అధికారులు నియంత్రణ చర్యలు తీసుకున్నారు.

సీఎం స్ఫూర్తిని అందిపుచ్చుకుంటున్నాం..

– ఎస్వీ రాజశేఖరబాబు, సీపీ, విజయవాడ



సాంకేతిక పరజ్ఞానాన్ని ప్రజలకు మెరుగైన సేవలు అందించే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తిని తీసుకుని ముందుకు సాగుతున్నాం. విజయవాడ నగరంలో డ్రోన్లతో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణలో మంచి ఫలితాలు సాధించాం. మంగళగిరిలోని పోలీసు టెక్ టవర్స్‌లో అన్ని జిల్లాల పోలీసు డ్రోన్ ఆపరేటర్లను పిలిపించి శిక్షణ ఇప్పిస్తున్నాం.

జగనన్న గృహం.. ఉండలేని దైన్యం!

దస్త్రాల్లో ఇళ్లు పూర్తి | నివాస భాగ్యం ఏదీ!

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వంలో రూ.1231 కోట్లు జగనన్న కాలనీల పేరుతో ఇళ్లకు ఖర్చు చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల పైగా ఆస్తి ఇస్తున్నట్లు నాటి ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పుకొన్నారు. భూసేకరణ, ఇతర మౌలిక వసతులకు రూ.వందల కోట్లు వెచ్చించారు. ఇంతచేసినా 5శాతం కూడా నివాసం ఉండని పరిస్థితి నెలకొంది. తూతూమంత్రంగా నిర్మాణం పూర్తి చేసిన కాలనీల్లో వర్షం వస్తే చెరువులను తలపిస్తున్నాయి. పూర్తి చేసిన ఇళ్లకు తాళాలు వేసుకున్నారు. పునాదుల్లో ఉన్న ఇళ్ల ఇనుప చువ్వలు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. కొన్ని మూడో ఆప్షన్ కింద కట్టిన ఇళ్లు కాలితో తంతే చాలు కూలిపోతున్నాయి. ఉచితంగా ఇసుక పేరుతోనూ గుత్తేదారుకు రూ.80 కోట్లు పైగా చెల్లించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేదెప్పుడో.. నివాసం ఉండేదెప్పుడో అని లబ్ధిదారులు నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు.

గృహ నిర్మాణాల తీరు ఇలా..

దశ	కృష్ణా జిల్లా
మంజూరైనవి :	91,300
నిర్మాణం చేపట్టినవి:	86,030
పూర్తి చేసినవి:	27,881
స్లాబ్ వేసినవి:	628
కప్పు వరకు నిర్మాణం:	2,155
పునాదుల్లో..:	12,592
పునాదుల వరకు:	42,375
ప్రారంభించనివి:	399
చెల్లింపులు..	
నగదు	442.774
సామగ్రి	165.820
ఇసుక	41.430
మొత్తం (రూ.కోట్లలో)	650.024

కృష్ణా జిల్లాలో పరిస్థితి..

✪ జిల్లాలో జగనన్న కాలనీల పేరుతో 690 లేఔట్లు వేశారు. అన్నీ చిన్నచిన్న కాలనీలుగా వేశారు. 175 చోట్ల అసలు ప్రారంభించలేదు. బందరులో కరగ్రహారం లేఔట్ జిల్లాలోనే అతిపెద్దది. సముద్రపు ఒడ్డున దీనిని వేశారు. మచిలీపట్నం నగరంలోని 5వేల మంది పేదలకు ఇక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించారు. నగర పరిధిలో కేవలం సెంటు స్థలమే పంపిణీ చేశారు.

✪ జిల్లాలో మొత్తం 91,300 గృహాలు మంజూరు చేశారు. జియో ట్యాగింగ్ పూర్తి చేయని వాటిని జాబితా నుంచి తొలగించారు. గృహ నిర్మాణాలు చేపట్టి నాలుగేళ్లు అవుతున్నా.. నిర్మాణం ముందుకు సాగడం లేదు. కొంతమంది సొంత ఖర్చులతో నిర్మాణం పూర్తి చేసుకున్నా.. మౌలిక వసతులు లేక ఇళ్లకు తాళాలు వేసుకున్నారు. కాపురాలు ఉండే పరిస్థితి లేదు.


✪ గత ప్రభుత్వంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కృష్ణా జిల్లా పెడనకు ప్రాతినిధ్యం వహించారు. సొంత జిల్లా అయినా గృహనిర్మాణంపై చిత్తశుద్ధి చూపించలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. 690 లేఔట్‌లకు మెరక, ఇతర పనులకు రూ.97.76 కోట్ల వరకు మంజూరు చేశారు. ఎక్కువ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే కాలనీలు మునుగుతున్నాయి. కరగ్రహారం లేఔట్ అదే విధంగా ఉంది.

✪ అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో, గుడ్లవల్లేరు, గుడివాడ ప్రాంతాల్లో వేసిన లేఔట్లు ముంపునకు గురవుతున్నాయి. ఇంటి నిర్మాణ సామగ్రి తీసుకొని వాహనాలు వెళ్లే పరిస్థితి లేక చాలా మంది వదిలేశారు. అంతర్గత రహదారులు నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది.

✪ 670 లేఔట్లలో గ్రామీణ నీటిసరఫరా విభాగం నీటి వసతి కోసం రూ.55.94 కోట్లు ఖర్చు చేశారు. ప్రజారోగ్య శాఖ నుంచి 9 లేఔట్ల కోసం రూ.8.94 కోట్లు వ్యయం చేశారు. జిల్లాలో 50 శాతం కాలనీలకు విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. దీనికి అదనంగా విద్యుత్తు ఉపకేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఎన్నికల ముందు గృహ ప్రవేశాలు చేయించి హడావుడి చేయాలని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

నాణ్యతకు తిలోదకాలు..

జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. సొంతంగా నిర్మాణం చేసుకున్న గృహాలు మినహా గుత్తేదారులు నిర్మించినవి నివాసయోగ్యం కావు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్ ధర పెరిగిన ఖర్చులకు అనువుగా లేకపోవడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. యూనిట్ ధర రూ.1.8లక్షలు, డ్వాక్రా రుణం రూ.35 వేలతో గుత్తేదారులు నిర్మాణం చేయాల్సి ఉంది. దీనికి అదనంగా రూ.50వేలు, రూ.లక్ష వసూలు చేశారు. డ్వాక్రా రుణం రాని వారికి తప్పనిసరిగా లబ్ధిదారు సొమ్ము చెల్లించాలని షరతు పెట్టారు. పునాదులు ఎత్తు పెంచితే ఒక ధర, ప్లాస్టరింగ్ చేస్తే మరో ధర, మెట్లు కడితే ఇంకో ధర నిర్ణయించి వసూలు చేశారు. యూనిట్ ధర రూ.1.8లక్షలు డ్వాక్రా రుణం రూ.35వేలతో కట్టిన ఇళ్లు ఏమాత్రం నాణ్యత లేకపోగా ప్లాస్టరింగ్ చేయడం లేదు. ఇంటి లోపల అరలు, వంట గది బల్ల, స్నానాల గది మరుగుదొడ్డి నిర్మాణం చేయకుండా వదిలేశారు.



మధ్య నియోజకవర్గం లేఔట్‌లో గుత్తేదారు కట్టి వదిలేసిన ఇళ్లు ఇలా



ఇనుప చువ్వలకు తుప్పు

బ్యారేజీకి 1,62,689 క్యూసెక్కుల వరద

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీకి ఆదివారం సాయంత్రానికి ఎగువ నుంచి 1,62,689 క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 3,923, పశ్చిమ ప్రధాన కాలువకు 1,516 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12 అడుగులు కాగా... 20 గేట్లను 4 అడుగులు, 50 గేట్లను 3 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

మృత్యు కుహరాలు!

ప్రమాదభరితంగా కృష్ణా నది పాయలు


రొయ్యూరు వద్ద ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు (పాత చిత్రం)

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: కృష్ణా నది పాయలు మృత్యుకుహరాలుగా తయారయ్యాయి. గత ఏడేళ్లలో పట్టా భూములను బుసక పేరుతో ఒల్లా చట్టాన్ని అతిక్రమించి పొక్లెయిన్లతో భారీగా ఇసుక తవ్వకాలు జరపడం, అధికారులు చూసీచూడనట్లు వదిలేయడం తదితర కారణాల వల్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రాణాంతకంగా మారాయి. ఇప్పటికే వీటి బారిన పడి పలువురు మృత్యువాత పడినా గత వైకాపా ప్రభుత్వ పట్టించుకున్న దాఖలాలు లేవు. త్వరలో కార్తిక మాసం ఆరంభమవుతున్నందున ఆయా ప్రాంతాలకు సందర్శకుల తాకిడి పెరిగే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వమైనా ప్రమాదకరమైన నదీ పాయలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తోట్లవల్లూరు మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో విస్తరించిన నదీ పాయల్లో ఇప్పటికే పలువురు మృతి చెందారు. మండలంలోని మొత్తం 16 గ్రామాలుండగా అందులో 8 లంక ప్రాంతాలు ఉన్నాయి. కొన్నింటి చుట్టూ నీరు ఉండగా.. కొన్ని లంక ప్రాంతాలు కృష్ణా, గుంటూరు జిల్లాల నది ఒడ్డున ఉన్నాయి. కృష్ణా నది ఒడ్డున, పాయల మధ్యలో చెరకు, అరటి, పసుపు, కంద, తమలపాకు వివిధ రకాల కూరగాయల పంటలు వేలాది ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. లంక గ్రామాల నుంచి నిత్యం ఆయా ప్రాంతాలకు కర్షకులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, వ్యాపారులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఏటా నది పాయకు వరద నీరు రావడంతో సుమారు నాలుగు నెలలు ప్రవహిస్తూ ఉంటుంది. గ్రామస్థులు ఆ లంకకు పశువులను తోలకెళ్లడంతో పాటు, పండించిన పంటలను ఒడ్డుకు తీసుకు వస్తుంటారు.


యువకుడి మృత దేహాన్ని వెలికి తీస్తూ.. (పాత చిత్రం)

ఇవిగో ప్రమాద ఘటనలు

☛ 2020 జూన్‌లో నర్రా జస్వంత్(11) తోట్లవల్లూరు నది పాయలో మునిగి మృతి చెందారు. అదే ఏడాది అక్టోబరు 3వ తేదీన రొయ్యూరు పాయలో పెనమలూరు మండలం గోసాల శివారు వైకుంఠపురం గ్రామానికి చెందిన కొలవెన్ను వీరయ్య(36), జెజవాడ సూర్యప్రకాశ్(17), యేసును రంజిత్, కంకిపాడుకు చెందిన జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు(29) నాలుగురు కరోనా నేపథ్యంలో చేపలు పట్టడానికి వచ్చి స్నానానికి దిగి మృతి చెందారు.

☛ 2021 ఆగస్టు 15వ తేదీన మండలం దేవరపల్లికి చెందిన జంపాన శివయ్య(52), నవంబరు 11న మండలం చాగంటిపాడు శివారు పిల్లివానిలంకకు చెందిన పిల్లి వెంకటేశ్వరరావు(50)లు గేదె తోక పట్టుకుని పాయ దాటుతుండగా ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందారు.

☛ నవంబరు 15వ తేదీన తోట్లవల్లూరుకు చెందిన కూడిపూడి నరేంద్ర(18), గొరిపర్తి శివనాగరాజు(20), గొరిపర్తి పవన్(18) తెల్లవారుజామున కార్తిక స్నానాలు చేయడానికి దిగి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

☛ గతంలో శివరాత్రికి తోట్లవల్లూరు పాయలో స్నానానికి దిగి లోతు తెలియక మునిగి యువకుడు మృతి చెందాడు.

☛ ఇలాంటి ఘటనలతో ఎన్నో కుటుంబాల్లో విషాదం నెలకుంటోంది.

కార్తిక మాసంలో పెరగనున్న ప్రజల తాకిడి

త్వరలో కార్తిక మాసం ఆరంభం కాబోతోంది. కృష్ణా నది పాయల వద్ద పలువురు పుణ్య స్నానాలకు దిగే అవకాశం ఉంది. వరద నీరు ప్రవహించే సమయంలో ఎంత లోతు ఉందో ప్రజలకు అవగాహన ఉండదు. కనీసం ఆ సమయంలో చెప్పేవారు కూడా ఉండరు. గత ప్రమాద ఘటనలను దృష్టిలో రేవుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీసు అధికారులు నది పాయల్లో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆదాయం రూ.6.38 లక్షలు


దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు భారీగా వచ్చి మొక్కులు సమర్పించారు. సామూహిక ఆదాయం రూ.6.38 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామప్రసాద్ తెలిపారు. ఆర్జిత సేవా టిక్కెట్ల రూపంలో రూ.3.72 లక్షలు, ప్రసాదాలు రూ.1.27 లక్షలు, అన్నదాన పథకాలకు రూ.79 వేలు, శాంతి కల్యాణంలో 59 మంది పాల్గొన్నారు. ఇతర పూజా కార్యక్రమాలతో కలిపి రూ.6.38 లక్షల ఆదాయం వచ్చిందని శ్రీరామప్రసాద్ పేర్కొన్నారు.

రూ.3.27 కోట్లతో ఫిల్టర్‌బెడ్లకు మరమ్మతులు


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, బాబ్జి తదితరులు

నందివాడ(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో గుడివాడ నియోజకవర్గంలో 44 గ్రామాల్లో రూ.3.27 కోట్లతో ఫిల్టర్‌బెడ్లకు మరమ్మతులు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆదివారం నందివాడ, గండేపూడి, పొనుకుమాడు, అంబేడ్కర్‌నగర్, జొన్నపాడు గ్రామాల్లో ఆయా పనులకు శంకుస్థాపన చేశారు. కంకిపాడు పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న పవన్‌కల్యాణ్ దృష్టికి ఎమ్మెల్యే ఈ సమస్యను తీసుకెళ్లడంతో ఆయన స్పందించిన సంగతితెలిసిందే. 43 గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులకు ఎండీఎఫ్ నిధులు రూ.91 లక్షలు, జడ్పీ రూ.1.36 కోట్లు మంజూరు కాగా, మరో రూ.కోటి ప్రభుత్వ నిధులు మంజూరు కానున్నాయని ఎమ్మెల్యే రాము వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల మంచికి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు పోటీలు పడి మరీ పనిచేస్తున్నన్నడానికి ఇదే ఉదాహరణ అన్నారు. పవన్‌కల్యాణ్‌తో రాము సెల్ఫీ వీడియో ద్వారా స్థానికులు నేరుగా కృతజ్ఞతలు తెలిపారు. అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మ తల్లి దేవస్థానాన్ని ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. గత ఆదివారం వరకు దేవీ నవరాత్రులతో మొక్కులకు అవకాశం లేకపోవడంతో నేడు వర్షాలు కురుస్తున్నా జిల్లా నలుమూలల నుంచి వేలాది భక్తులు తరలివచ్చి పూజాదికాలు నిర్వహించారు. మహిళలు సామూహిక పాలపొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. తలనీలాలు, మొక్కులు తీర్చుకుని బంధుమిత్రులకు అన్నసమారాధనలు చేసుకున్నారు. పెళ్లిళ్లు జరుగుతున్న నేపథ్యంలో కొత్త దంపతులు పసుపు దుస్తులతో అమ్మవారి దర్శనం చేసుకున్నారు.


శతజయంతి వేడుకల సన్నాహక సమావేశంలో పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా జిల్లాలో మొట్టమొదట 1921లో ఏర్పాటైన తాడంకి జడ్పీ ఉన్నత పాఠశాల శత జయంతి వేడుకల కోసం హైదరాబాద్‌లోని పూర్వ విద్యార్థులు ఆదివారం బంజారాహిల్స్ తబలా హోటల్‌లో సమావేశమయ్యారు. 2025 జనవరి 12వ తేదీన తాడంకి పాఠశాలలో జరిగే ఉత్సవాల కార్యాచరణకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. 1950, 70, 80 సంవత్సరాల నాటి సెవెంత్ ఫార్మ్, ఎస్ఎస్ఎల్‌సీ, పదో తరగతి పూర్వ విద్యార్థులందరూ గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు ఇదే పాఠశాలలో చదువుకున్నట్టు అనంతలక్ష్మి తెలిపారు. కార్యక్రమాన్ని తిరుమల ప్రసాద్ నిర్వహించగా.. ఏనుగు మస్తాన్‌రావు, ఎమ్మెస్ ప్రకాశరావు, ఎర్రబోతు ప్రభాకర్‌రావు, ఎస్. వెంకటేశ్వరరావు, ఎస్.అనంతలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

బంగారు బందరుకు బాటలు వేద్దాం

ప్రతి వారం శ్రమదాన కార్యక్రమం

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: బంగారు బందరు.. స్వచ్ఛ బందరు కోసం ప్రణాళికాబద్ధంగా తగు చర్యలు తీసుకుంటామని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. 'బంగారు బందరు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూటమి నాయకులు బండి రామకృష్ణ, సోడిశెట్టి బాలాజీ, బాబా ప్రసాద్, గోపీచంద్, మాదివాడ రాము తదితరులతో పాటు కార్యకర్తలతో కలిసి మూడు స్తంభాల సెంటరు వద్ద మంత్రి శ్రమదానం చేశారు. ప్రతి వారం ఏదో ప్రాంతంలో ఒక పూట శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నామన్నారు. మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) అసమర్థత నగరాభివృద్ధికి శాపంగా మారిందన్నారు. గడచిన ఐదు సంవత్సరాల్లో కార్పొరేషన్‌కు పైసా నిధులు ఇవ్వని చెత్త ప్రభుత్వాన్ని చూశామన్నారు. త్వరలో కృష్ణా విశ్వవిద్యాలయం సమీపంలో నూతనంగా కేటాయించిన డంపింగ్ యార్డ్‌ను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ప్రతి నెలా చెత్తను తరలించేందుకు పనికిరాని ఆటోలను పెట్టి ఒక్కో వాహనానికి రూ.55 వేల చొప్పున డబ్బులు దోచుకున్నారని విమర్శించారు. గతానికి సంబంధించిన బకాయిలు చెల్లించకపోతే చెత్త తరలింపు వాహనాలు నిలిపివేస్తామంటూ నిర్వాహకులు బెదిరిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత పాలకుల అసమర్థత..

వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే...


మూడు స్తంభాల సెంటరు వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న మంత్రి రవీంద్ర, నాయకులు

డ్రెయిన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

గతంలో కేంద్ర ప్రభుత్వం అమృత్ స్కీం ద్వారా రూ.71 కోట్లు మంజూరు చేస్తే అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ మ్యాచింగ్ గ్రాంట్ కట్టకుండా అప్పటి ఎమ్మెల్యే సూచనల మేరకు నిధులు అవసరం లేదంటూ తీర్మానం చేయడం సిగ్గు చేటన్నారు. ఆ నిధులతో పాటు డ్రెయిన్ల అభివృద్ధి కోసం రమారమి రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. సుందరయ్యనగర్, బందరు కోట, కరగ్రహారం రైల్వేగేటు తదితర ప్రాంతాల్లో ఎస్‌టీపీల ఏర్పాటుతో పాటు నగరంలో పడిన వర్షపునీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.


పోలీసుల గాలింపు చర్యలు

ఇంకా లభించని జగన్నాథమూర్తి ఆచూకీ


పాయ వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: తోట్లవల్లూరు కృష్ణా నది పాయలో శుక్రవారం మధ్యాహ్నం స్నానానికి దిగి గల్లంతైన జగన్నాథ మూర్తి(35) ఆచూకీ ఆదివారం సాయంత్రం వరకు లభించలేదని ఎస్సై అర్జునరాజు తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పడవలపై తోట్లవల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టగా.. శనివారం రాత్రి నుంచి వరద ఉద్ధృతి పెరిగిందని తెలిపారు. దీనివల్ల కొంత ఇబ్బందికరంగా మారిందన్నారు. మరోపక్క జగన్నాథమూర్తి కుటుంబ సభ్యులు తోట్లవల్లూరు పాయ వద్ద ఎంతగానో రోదిస్తున్నారు. పులిగడ్డ వారిధి వద్ద గాలింపునకు ఓ వ్యక్తిని ఏర్పాటు చేశామని, సోమవారం కూడా గాలింపు చర్యలు చేపడతామని ఎస్సై తెలిపారు.

కృష్ణమ్మ ఉరకలు.. మేఘాల పరుగులు



కృష్ణమ్మను మేఘాలు ముద్దాడినట్లు ఉన్న ఈ సుందర దృశ్యం సోమవారం చూపరులను కనువిందు చేసింది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో సోమవారం ప్రకాశం ప్రకాశం బ్యారేజి 70 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ నీటి అలలపై విజయవాడ రైలు వంతెన వద్ద ఆకాశంలో దట్టంగా ఉన్న తెల్లని మేఘాలు వచ్చి తాకినట్లు కనిపించాయి.

-ఈనాడు, అమరావతి

రైల్‌నీర్ ప్రాజెక్టుకు మోక్షం



విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైల్‌నీర్ ప్రాజెక్టుకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ఏళ్ల తరబడి సాగుతున్న పనులు తుది దశకు చేరాయి. 2010లో రైల్వే మంత్రిగా ఉన్న మమతాబెనర్జీ దేశంలోని ఐదు ప్రాంతాల్లో రైల్‌నీర్ ప్రాజెక్టులు ప్రకటించగా అందులో ఏపీకి ఒకటి కేటాయించారు. అనంతరం ప్రాజెక్టు వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. గడిచిన ఐదేళ్లల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందకపోవడంతో ప్రాజెక్టు పూర్తిగా పడకేసింది. 2018లో కృష్ణా జిల్లా మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో అప్పటి చంద్రబాబు సర్కార్ స్థలం కేటాయించగా ప్లాంట్ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. 2020 నాటికి ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉన్నా తిరిగి సాంకేతిక కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం ఉన్న గుత్తేదారు శరవేగంగా పనులు చేపట్టడంతో దాదాపు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ప్రతి రోజూ లక్ష బాటిళ్లను ఉత్పత్తి చేసేందుకు వీలు కలుగుతుంది. విజయవాడ రైల్వేస్టేషన్‌తో పాటు ఇక్కడి నుంచే ఇతర డివిజన్లకు కూడా బాటిళ్లను సరఫరా చేయనున్నారు. బయట ప్రైవేటు కంపెనీలతో పోలిస్తే రైల్‌నీర్ బాటిళ్లు ప్రయాణికులకు తక్కువ ధరకు లభించనున్నాయి. అన్నీ అనుకూలిస్తే మరో 10రోజుల్లో ప్లాంట్ ప్రారంభం కానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మల్లవల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రారంభమయ్యే తొలి ప్రాజెక్టు ఇదే కానుంది.

గ్రంథాలయాలు ఆధునికీకరించాలి


పుస్తకాలను పరిశీలిస్తున్న సురేష్‌బాబు, తదితరులు

ఘంటసాల, న్యూస్‌టుడే: గ్రంథాలయాలను ఆధునికీకరించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు తెలిపారు. ఘంటసాల గ్రంథాలయంలో ఆదివారం ఆయన పుస్తకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షల యుగంలో అన్ని గ్రంథాలయాల్లో కంప్యూటర్ తోపాటు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ప్రశంసించారు. ఉద్యోగులు సంఘం నాయకులు కొడాలి శామ్యూల్, ఎం.సుబ్బారావు, ఎం.వేణు తదితరులు పాల్గొన్నారు.

స్వామిసేవలో దేవాదాయ అడిషనల్ కమిషనర్

మోపిదేవి, న్యూస్‌టుడే: దేవాదాయ, ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ తెనాలి చంద్రకుమార్ ఆదివారం మోపిదేవి శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో దర్శించారు. ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద్ స్వామివారి చిత్రపటం అందించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.

మోదీ సారథ్యంలో దేశాభివృద్ధి


మాట్లాడుతున్న బిట్రా శివన్నారాయణ

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంతోనే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని, అందువల్ల ప్రజలంతా భాజపా వైపు చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో పార్టీ కృష్ణా జిల్లా క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక దేశంలో అభివద్ధి పరుగులు తీస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరంతో పాటు పలు రకాల అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు అందించారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, జిల్లా ఇన్‌ఛార్జి ఉన్నమట్ల కపర్థీ, మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ సూరే లక్ష్మీనారాయణ(గాంధీ), రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెరువులు బుచ్చిబాబు, అయోధ్య రామయ్య, గణేష్ తదితరులు పాల్గొని పార్టీ సభ్యత్వాల పుస్తకాలు ఆవిష్కరించారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ -220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

నది దాటితేనే గమ్యం చేరేది


ఎడ్లబండిపై నది దాటుతున్న పాత ఎడ్లంక వాసులు

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: గత నెలలో కృష్ణా నదికి వచ్చిన వరదలు అవనిగడ్డ మండలం పాతఎడ్లంకకు వెళ్లే దారిని ఛిద్రం చేశాయి. దీంతో గ్రామస్థుల రాకపోకలకు రెవెన్యూ శాఖ మరపడవను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో పడవ యజమాని ప్రభుత్వం సొమ్ములు చెల్లించలేదంటూ ముఖం చాటేశాడు. గ్రామస్థులు పొట్టకూటి కోసం రోజూ నదిదాటి అవనిగడ్డకు రావాల్సిందే. గ్రామంలోని విద్యార్థులు అవనిగడ్డలోని పాఠశాలలకు, కళాశాలలు రావాల్సి ఉంది. గత్యంతరం లేని గ్రామస్థులు ఎడ్ల బండ్లపై ప్రమాదకరంగా కృష్ణానది పాయను దాటి బాహ్య ప్రపంచంలోకి వస్తున్నారు. వారి ఇబ్బందులు తీర్చడానికి అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం గమనార్హం.. పాత ఎడ్లంకకు వారధి నిర్మాణానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందో అని గ్రామస్థులు నిట్టూర్పులు విడుస్తున్నారు.

దీన్ దయాళ్ స్పర్శ్ యోజన పరీక్షలు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: తపాలా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో దీన్ దయాళ్ స్పర్శ్ యోజన ఉపకార వేతన పరీక్షలు ఆదివారం విద్యాలయ పబ్లిక్ స్కూలులో నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు సుమారు 200 మంది పాల్గొన్నారని తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్ తెలిపారు. గుడివాడ పోస్టల్ సూపరింటెండెంట్ చల్లా అప్పారావు, పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, మండల విద్యాశాఖాధికారి బాలాజీ, పోస్టు మాస్టర్ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

? కొప్పల్లి శివారు ముచ్చిలిగుంట గ్రామానికి ఉప్పలకలువ గుంట సామూహిక రక్షిత మంచినీటి పథకం నుంచి తాగు నీరు అందటం లేదు. ప్రధాన పైపులైను మరమ్మతులు చేయాల్సి ఉంది. **-స్థానికులు**

✔ ప్రధాన పైపు లైనుకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. **-పూరిళ్ల దుర్గా భవాని, సర్పంచి**

న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

గ్యార్మీ షరీఫ్ వేడుకలు

ఆకులమన్నాడు(గూడూరు), న్యూస్‌టుడే: ఆకులమన్నాడులో ఆదివారం గ్యార్మీ షరీఫ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనం చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు పోతన స్వామి, సర్పంచి మహ్మద్ రఫీ, బేగ్, ఎండీ రఫీ, రెహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

గోఖలే మృతి తీరని లోటు



నివాళులు అర్పిస్తున్న గద్దె అనురాధ, ఎమ్మెల్యే కాగిత తదితరులు

గూడూరు : తెదేపా నాయకుడు చిలుకోటి గోపాలకృష్ణ గోఖలే మృతి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన సంతాప సభను ఆదివారం మండల పరిధిలోని చిట్టిగూడూరు గ్రామంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ పాల్గొని నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. విశ్రాంత ఏఎస్పీ గోసాల మురళీకృష్ణ, పోతన లక్ష్మీనరసింహస్వామి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ప్రజాభిమానం పొందేలా సేవలు అందించాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. ఇక్కడి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నగర పరిధిలోని సచివాలయ అడ్మిన్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. బందరును ఆదర్శనగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలన్నారు. సచివాలయాల్లోని ప్రతి ఉద్యోగి తమ పరిధిలో సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సీసీ రహదారులు, డ్రెయిన్లు, అంగన్‌వాడీ, మున్సిపల్ పాఠశాలల మరమ్మతులు తదితరాలకు అవసరమైన నిధులు సమకూరుస్తామని చెప్పారు. పట్టభద్రులు తాజాగా ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. సకాలంలో సజావుగా పింఛన్లు పంపిణీ చేస్తుండడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపిచంద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, ఇలియాస్‌పాషా, సోమశేఖర్, పల్లపాటి సుబ్రమణ్యం, కొట్టె వెంకట్రావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న మంత్రి రవీంద్ర

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు..

పారిశుద్ధ్య కార్మికులు ప్రజారోగ్యం కోసం చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇటీవల వరదల సందర్భంగా విజయవాడ వెళ్లి సేవలు అందించిన 250 మంది పారిశుద్ధ్య కార్మికులకు రూ.5 లక్షల విలువైన ఏకరూప దుస్తులను మంత్రి పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న 14 మందికి వైద్య సేవల నిమిత్తం పార్టీ కార్యాలయంలో రూ.29 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం స్థానిక శక్తిగుడి వద్ద దసరా పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. నగర ప్రజలు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరేం..!

బ్లాక్ స్పాట్లపై కొరవడిన పర్యవేక్షణ

మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే: మచిలీపట్నం నుంచి విజయవాడ వెళ్లే జాతీయ రహదారి వెంబడి తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, వాటికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసుశాఖ ఏర్పాటు చేసిన బ్లాక్ స్పాట్లపై పర్యవేక్షణ ఉండకపోవడం విమర్శలకు తావిస్తోంది. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి అక్కడ వేగాన్ని నియంత్రించేందుకు పోలీసుశాఖవారు రహదారికి అడ్డంగా ఒక్కో ప్రాంతంలో మూడు ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసి వాటిపై రాత్రి పూట కనిపించేలా రేడియం స్టిక్కర్లు అంటించారు. ప్రారంభంలో కొంతకాలం అక్కడ పర్యవేక్షణకు పోలీసు సిబ్బందిని కూడా నియమించారు. తర్వాత పట్టించుకోవడమే మానేశారు. గూడూరు మండల పరిధిలోని రామరాజుపాలెం అడ్డరోడ్డు, గూడూరు, తరకటూరు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డ్రమ్ములు పగిలిపోయి ఉన్నాయి. గూడూరు ప్రధాన కూడలిలో ఉన్నవి మూలకు చేరాయి. రామరాజుపాలెం అడ్డరోడ్డు నుంచి తరకటూరు వరకు రహదారి పొడవునా అన్ని చోట్లా పర్యవేక్షణ లేక పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. ప్రమాద సూచికతోపాటు స్టాప్ అనే ఫ్లెక్సీ డ్రమ్ములపై అతికించారు. అవి కూడా చిరిగి పాడైపోయాయి. దీంతో ఆయా ప్రాంతాలను వాహనదారులు గుర్తించలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



గూడూరు ప్రధాన కూడలిలో చిందరవందరగా డ్రమ్ములు



తరకటూరు వద్ద పనిచేయని సీసీ కెమెరాలు

నిఘా నేత్రాలు అలంకారప్రాయం..

రహదారి వెంబడి వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. తరకటూరు కూడలిలోనివి పనిచేయకపోవడంతోపాటు దీపాలు కూడా సక్రమంగా వెలగక పోవడంతో రాత్రిపూట ఆకతాయిలు చేరి మద్యం తాగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద ఇదే పరిస్థితి. మచిలీపట్నం నుంచి గూడూరు మండలంలోని రామరాజుపాలెం, ఆకుమర్రు, మల్లవోలు, పోలవరం, రాయవరం తదితర గ్రామాలతో పాటు మొవ్వ మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రాంతంలో పర్యవేక్షణ లేకపోవడం దారుణమని, ఇప్పటికైనా పోలీసుశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సినిమాలు

రేవతి: వేట్టయన్, **సిరివెంకట్:** దేవర
సిరికృష్ణ: విశ్వం, **రామరాజు:** జనక అయితే గనక -మచిలీపట్నం, కార్పొరేషన్

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కూచిపూడి, న్యూస్‌టుడే: స్థానిక శ్రీసిద్ధేంద్ర ఓరియంటల్ జడ్పీ పాఠశాలలో 1984-85 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. రూ.2 లక్షలతో నిర్మించిన సైకిల్ షెడ్‌ను పాఠశాల పూర్వ విద్యార్థిని, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి, విశ్రాంత ఉపాధ్యాయులు జె.బి.టి. సుందరి(తెలుగు), కె. మార్కెండేయులు(సోషల్)లు ప్రారంభించారు. పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడిన అప్పటి పూర్వ విద్యార్థులు పాల్గొని గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆ పాఠశాల జూనియర్ అసిస్టెంట్ బదరీనారాయణ, చామర్తి వెంకటరమణ, హెచ్ఎం సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి పాలన

బంటుమిల్లి, న్యూస్‌టుడే: కూటమిపై నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, వారి ఆశలకు అనుగుణంగా సంక్షేమం అందించడంతో పాటు గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని అర్తమూరు, కొర్లపాడులో నిర్వహించిన 'పల్లె పండగ' కార్యక్రమాల్లో ఆయన పాల్గొని సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగు నీటి సమస్యలను పరిష్కరించి స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తామని చెప్పారు. కొర్లపాడు సర్పంచి అట్లూరి రమేష్, తెదేపా మండల కన్వీనర్ కూనపురెడ్డి వీరబాబు, యిల్లూరి లీలాకృష్ణ, బొర్రా కాశీ, రేవు గోపాలకృష్ణ, జరీనా, జొన్నలగడ్డ కొండ, యార్లగడ్డ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కొర్లపాడులో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, నాయకులు

పట్టభద్రుల ఓట్లు అత్యంత కీలకం

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెదేపా ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్ కోరారు. నగర పరిధిలోని 45వ డివిజన్‌లో ఆదివారం కార్యకర్తలతో కలిసి ఓటరుగా నమోదు చేసుకునే ఫారం-18లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో వినియోగించిన ఓటరు జాబితాలు ప్రస్తుతం చెల్లుబాటు కావన్నారు. రాబోయే కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు చేసేందుకు నవంబరు 6 లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. 2021 నవంబరు ఒకటో తేదీ నాటికి ఏదైనా డిగ్రీ, ఇంజినీరింగ్, తదితర కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు.



ఫారం-18 పంపిణీ చేస్తున్న ఫణికుమార్, తెదేపా కార్యకర్తలు

క్రిమిలేయర్ విధానంపై పునరాలోచించండి

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: ఎస్సీ కులాల వర్గీకరణ విషయంలో క్రిమిలేయర్ విధానంపై పునరాలోచన చేయాలని ఎస్సీ సంఘ నాయకులు గంట చిన్న వెంకటేశ్వరరావు కోరారు. క్రిమిలేయర్ విధానం గురించి ఎస్సీ వర్గాల్లో అవగాహన కలిగించేందుకు ఎస్సీ సంఘాల నాయకులు ఆదివారం సింహాచలం, వాడగొయ్యి గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రా సునీల్‌కుమార్, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు విజయ్ జాలాది రాజా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉత్తేజం

పెనమలూరు : నిత్యం వైద్యసేవలు, విధి నిర్వహణలో తీరిక లేకుండా గడిపే వైద్యులు తరచూ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించడం ద్వారా మానసికోల్లాసం, ఉత్తేజాలను పొందవచ్చునని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన ఈనెల 23 నుంచి ప్రారంభించనున్న డీపీఎల్-6 ట్రోఫీ క్రికెట్ పోటీలను ఆయన ఆదివారం పెనమలూరులో ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, అధ్యక్షుడు తుమ్మల కార్తీక్, 12 ఫ్రాంఛైజీల సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానం.. ప్రయాణ ప్రాంగణం



స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణం అధ్వానంగా మారటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మచిలీపట్నం-గుడివాడ-నర్సాపురం రూటులో ఉన్న ప్రాంగణం నుంచి రోజుకు వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆవరణ గోతుల మయంగా మారటంతో బస్సులు ఎక్కి దిగేందుకు అవస్థలు తప్పటంలేదు. ఇక వర్షం కురిస్తే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. **-న్యూస్‌టుడే, పెడన**

ప్రత్యేక పూజలు..నగర సంకీర్తన



బాబాకు హారతి ఇస్తున్న భక్తులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని ఈడేపల్లి సత్యసాయి మందిరంలో ఆదివారం సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సత్యసాయి మందిరంలో విశేషపూజలు, దివ్య పాదుకలకు అభిషేకాలు చేశారు. అనంతరం నగర సంకీర్తన నిర్వహించారు. సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మంత్రి రవీంద్రకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదివారం మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ నాయకులు ఓఎల్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆసుపత్రిలో పనిచేసే కార్మికులకు రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ నిధులు సక్రమంగా అందించడం లేదని అన్నారు. నాయకులు జె.జయలక్ష్మి, పి.సుధీర్, ఎం.ఫణీంద్ర, జి.దుర్గాప్రసాద్, పి.దుర్గా, వి.శివలలిత, పి.వెంకటలక్ష్మి, ధనలక్ష్మి, మంగారావు, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: ఆరోగ్యానికి దంత సంరక్షణ కూడా ముఖ్యమని డా.జొన్నలగడ్డ ఉష అన్నారు. నగరంలోని వాకర్స్ భవనంలో ఉదయపు నడక మిత్ర మండలి, మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ రాత్రి నిద్రపోయేముందు కూడా దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. సభ్యుడు టీఆర్‌కే గుప్తా తన భార్య తమ్మన సూర్యకుమారి జ్ఞాపకార్థం వినికిడి లోపం ఉన్న వ్యక్తికి వినికిడి యంత్రపరికరాలు అందజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, మిత్రమండలి అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జల్దు మురళీనాథ్, సభ్యులు పాల్గొన్నారు. నిర్వాహకులు అతిథులను సత్కరించారు.

ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు

పెడన, బంటుమిల్లి, న్యూస్‌టుడే: పెడనకు చెందిన విశ్వభారతి విద్యా సంస్థ అధినేత, జిల్లా ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుమకొండ గౌరీ ప్రసాద్, బంటుమిల్లి సెయింట్ జాన్స్ హైస్కూల్ డైరక్టర్ సాబుజాన్‌లు డా.ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఏసీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు వారికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. విద్యారంగంలో వీరు అందించిన విశిష్ట సేవలు, ప్రవేటు విద్యా సంస్థల అభివృద్ధి కోసం చేసిన కృషి, ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు అనేక రకాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఈ పురస్కారాలు లభించాయి. అవార్డు గ్రహీతలను పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు అభినందించారు.





గుంటూరులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న సాబుజాన్, గౌరీప్రసాద్

50 రోజులైనా ముంపులోనే పొలాలు

★ అస్తవ్యస్త డ్రెయిన్లే కారణం ★ దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

గుండుపాలెం(మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన వర్షాల నుంచి గుండుపాలెం, చిన్నాపురం, వెంకటాపురం రైతులు ఇంకా తేరుకోలేకపోతున్నారు. మూడు గ్రామాల్లో 50 ఎకరాల్లో ముంపు ఇంకా తొలగలేదు. తిరిగి సాగును ఆరంభించేందుకు మెరక ప్రాంతంలో నారుమడులు పోసినా పొలంలో నాలుగు అడుగుల మేర నీరు నిలువ ఉండటంతో రైతులకు దిక్కు తోచటం లేదు. ముంపు ఎపుడు తొలగుతుందా? నాట్లు ఎప్పుడు వేసుకుందామా? అని ఎదురు చూస్తున్నారు.



గుండేరులో తొలగించని పాత వంతెన



గుండుపాలెంలో నీటిలో నానుతున్న చేలు

వైకాపా ప్రభుత్వం చేసిన పాపం నేడు రైతులకు శాపమైంది. గత ఐదు సంవత్సరాలలో డ్రెయిన్ల పూడిక తీయించకపోవటమే ముంపుకు ప్రధాన కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. సార్వా సాగు అనంతరమైనా డ్రెయిన్లను పూర్తిస్థాయిలో తవ్వించాలని రైతులు కోరుతున్నారు.

అవరోధంగా పాత వంతెన..

గుండేరు డ్రెయిన్‌పై పాత వంతెన శిథిలావస్థకు చేరటంతో ప్రభుత్వం కొత్త వంతెన నిర్మించింది. అనంతరం దాన్ని తొలగించలేదు. దీంతో పాతవంతెనలో కొంతభాగం డ్రెయిన్‌లో కూలిపోయి నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. కూలిన ప్రదేశంలోనే గుర్రపుడెక్క కూడా మేట వేయటంతో ప్రవాహం ఎదురుతన్ని పొలాల్లోని నీరు డ్రెయిన్‌లోకి పారటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని డ్రెయిన్స్ ఏఈ మొహమ్మద్ నజ్మా తెలిపారు.

ఏం చేయాలో అర్థం కావడం లేదు.. -ధనికొండ వెంకటేశ్వరరావు, గుండుపాలెం



మా పొలం 60 సెంట్లు ముంపునకు గురైంది. నాటు వేసే సమయం వచ్చినా పొలంలో నీరు తగ్గకపోవటంతో ఏమీ చేయాలో అర్థం కావటం లేదు. డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



విద్యార్థితో మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య

మచిలీపట్నం (గొడుగుపేట) : విద్యార్థులు చదువుతోపాటు చట్టాల గురించి తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఆయన బందరు మండలం బైరాగిపాలెం బెరాకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలోని వసతిగృహాన్ని సందర్శించారు. వసతులపై ఆరా తీశారు ఎలాంటి సమస్య ఉన్నా సంస్థ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయవాది అజ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యాయత్నం

పెడన, న్యూస్‌టుడే: బ్లేడుతో కోసుకుని ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి స్థానిక బంటుమిల్లి రోడ్డు సెంటరుకు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక భవనంలో నివాసం ఉంటున్న బసవ గిరీష్ ప్రసాద్(28) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ సంఘటనకు పాల్పడ్డారు. గాయపడిన అతడిని మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దావోజీపాలెంలో నేత్ర వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దావోజీపాలెంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అశ్వినీ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 700ల మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 350 మందికి కళ్లజోళ్లు అవసరంగా గుర్తించారు. మరో 100 మంది కాటరాక్ట్ ఆపరేషన్లు చేయించుకోవాలని సూచించారు విజయవాడ చైతన్య కంటి ఆస్పత్రి వైద్యులు డా.అంకెం శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో పలువురు వైద్యులు ఈ పరీక్షలను నిర్వహించారు. విజయ అమలేశ్వరీ దేవస్థానం కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సేవలు అందజేశారు.

వంతెన శిథిలం.. రాకపోకలకు భయం

బంటుమిల్లి నుంచి గుడివాడ వెళ్లే రహదారిలో పెదతుమ్మిడి మురుగు కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. గత వైకాపా ప్రభుత్వం కొత్త వంతెన నిర్మాణాన్ని ప్రతిపాదనలకే పరిమితం చేసింది. రెయిలింగ్ పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనచోదకులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడానికి వీల్లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి పూట ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. కొద్ది నెలల కిందట చేపల లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కాలువలోకి బోల్తా కొట్టింది. నిత్యం ఇటుగా ఆర్టీసీ, కళాశాల బస్సులు, ఆటోలు, లోడు వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన పూర్తిగా కూలిపోకముందే కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని, ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, బంటుమిల్లి**



రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా ఇలా..



ప్రమాదానికి గురైన లారీ (పాత చిత్రం)

ఫోకస్

జగనన్న కాలనీ..కష్టాల లోగిలి



నివాసాల చెంతనే నీటి మడుగు



బురదమయమైన అంతర్గత రహదారి

గుండుపాలెం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: గుండుపాలెం జగనన్న కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. అంతర్గత రహదారులు బురదకయ్యలుగా మారాయి. మంచినీటి సరఫరా లేదు. ఇంటి నిర్మాణ సామగ్రిని ఇళ్ల వద్దకు చేర్చుకోవటానికి లబ్ధిదారులు అష్టకష్టాలు పడుతున్నారు. కాలనీలో 140 మందికి స్థలాలు కేటాయించగా కొద్దిమందే ఇళ్లు పూర్తి చేయగలిగారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

క్రీడలతో మానసిక ఉత్తేజం

పెనమలూరు, న్యూస్‌టుడే: నిత్యం వైద్యసేవలు, విధి నిర్వహణలో తీరిక లేకుండా గడిపే వైద్యులు తరచూ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించడం ద్వారా మానసికోల్లాసం, ఉత్తేజాలను పొందవచ్చునని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన ఈనెల 23 నుంచి ప్రారంభించనున్న డీపీఎల్-6 ట్రోఫీ క్రికెట్ పోటీలను ఆయన ఆదివారం పెనమలూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులకు కూడా ఆటవిడుపు ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, అధ్యక్షుడు తుమ్మల కార్తీక్, 12 ఫ్రాంఛైజీల సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలకు గుర్తింపు

ఉయ్యూరు: వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గానూ వాసవీ క్లబ్ ఉయ్యూరు సర్కిల్‌కు పలు అవార్డులు వచ్చాయని అధ్యక్షుడు పూర కిషోర్‌కుమార్ తెలిపారు. విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఆదివారం జరిగిన రీజినల్ కాన్ఫరెన్స్ సమావేశంలో క్లబ్ కార్యవర్గానికి అవార్డులు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. సూపర్ బెస్ట్ అధ్యక్షుడిగా, ఉత్తమ సర్వీస్, ఉత్తమ కోశాధికారి, కార్యదర్శితో పాటు పర్యావరణ పరిరక్షణ, తదితర విభాగాల్లో అవార్డులు వచ్చాయని తెలిపారు.



పురస్కారాలు చూపుతున్న కిషోర్‌కుమార్ తదితరులు

గన్నవరంలో వర్షం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం సుమారు గంటపాటు గాలులు వీచడంతో చెట్లు నేలకూలాయి. పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గత నాలుగురోజులుగా చోటుచేసుకున్న వాతావరణ మార్పుల కారణంగా ఉక్కిరిబిక్కిరి అయి అనారోగ్యాలకు గురవుతున్నామని పలువురు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.



రాయ్‌నగర్‌లో కూలిన చెట్టు

పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ప్రత్యేక కౌంటర్

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటర్ల నమోదు కోసం తన కార్యాలయంలో సోమవారం జరిగే మీ కోసం కార్యక్రమం నందు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఉయ్యూరు మండల తహసీల్దార్ సురేశ్ తెలిపారు. డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఓటర్ ఐడెంటిటీ కార్డు, ఆధార్ కార్డు, జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకొచ్చి నమోదు చేయించుకోవాలని కోరారు.

7 రోజులు.. 770 టన్నుల చెత్త

'క్లాప్' వ్యాన్ డ్రైవర్ల సమ్మెతో పేరుకుపోయిన వ్యర్థాలు ★ క్షీణించిన పారిశుద్ధ్యం

కానూరు, తాడిగడప, పోరంకి, న్యూస్‌టుడే

గత వారం రోజులుగా విరామం లేకుండా 'క్లాప్' వ్యాన్ డ్రైవర్లు చేపడుతున్న సమ్మె ప్రభావం తాడిగడప పురపాలిక పరిధిలోని పారిశుద్ధ్యంపై పడింది. ఇంటింటికీ వచ్చి చెత్త తీసుకువెళ్లే వాహనాలు రాకపోవటంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 13 నుంచి డ్రైవర్లు సమ్మె చేస్తున్నారు. తమకు రావాల్సిన మూడు నెలల జీతాలను చెల్లించే వరకు తాము విధులకు హాజరుకాబోమని చోదకులు చెబుతుంటే.. పురపాలిక అధికారులు మాత్రం ఈ విషయం తమ చేతుల్లో లేదని ప్రభుత్వమే చెల్లించాలని అంటున్నారు. వ్యాన్ డ్రైవర్లు లేకపోవటంతో కొన్ని ముఖ్యప్రాంతాలలో ట్రాక్టర్లు పెట్టి చెత్తను తీయిస్తున్నా ఊరట కలగడం లేదు.

పురపాలిక సమాచారం
జనాభా: 2,00,000
క్లస్టర్లు: 4 (కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు)
రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త: 110 టన్నులు
గత వారం రోజులుగా ఉత్పత్తి అయింది: 770 టన్నులు
క్లాప్ వ్యాన్ డ్రైవర్లు : 42



శ్రీనివాసనగర్ కాలనీలో చెత్త



పంటకాలువ రోడ్డు వెంబడి..

పొంచి ఉన్న ఆరోగ్య సమస్యలు..

ఇప్పటికే కాసేపు ఎండ.. అంతలోనే వాన కురుస్తుండడంతో విషజ్వరాలు, డెంగీ, సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్యం కూడా క్షీణిస్తే ఈ చెత్త తీయకపోవటం వల్ల దుర్వాసన, ఇతర కారణాలతో తాము పూర్తిగా అనారోగ్యం పాలవుతున్నామని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దృష్టిసారించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రోడ్లన్నీ చెత్తే..



రోడ్లన్నీ చెత్తతో నిండిపోయాయి. దుర్వాసన వ్యాపించి ఇబ్బంది పడుతున్నాం. పురపాలిక కమిషనర్ స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

-టి.చంటి, పోరంకి

జీతాలు వచ్చే వరకు కొనసాగిస్తాం



గత 3 నెలలుగా జీతాలు లేక 42 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మా సమ్మె వల్ల ప్రజలకు ఇబ్బందే కానీ అప్పులు చేసి జీవనం సాగిస్తున్న మా పరిస్థితి ఏంటి..?. జీతాలిచ్చేవరకు సమ్మె కొనసాగిస్తాం. **-రాచకొండ నరేంద్ర, క్లాప్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు**

ట్రాక్టర్లు ఏర్పాటు చేశాం..

వ్యాన్ డ్రైవర్లు సమ్మె కారణంగా పలు ప్రాంతాలలో చెత్తను ట్రాక్టర్ల ద్వారా సేకరించి తరలిస్తున్నాం. ఈ సమ్మెపై నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వం చేతుల్లోనే ఉంది. అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. - **పి.భవానీప్రసాదు, మున్సిపల్ కమిషనర్, తాడిగడప పురపాలక సంఘం**

పెరుగుతున్న వరద ప్రవాహం

మద్దూరు/ కాసరనేనివారిపాలెం (కంకిపాడు), న్యూస్‌టుడే : కృష్ణా వరద ఉధ్ధృతి క్రమంగా పెరుగుతోంది. శనివారం రాత్రికి 71వేల క్యూసెక్కుల నీరు రాగా, ఆదివారం సాయంత్రానికి 1.62లక్షల క్యూసెక్కులు విడుదల చేయడంతో నదీ పరివాహక గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు, రైతులు, పశుపోషకులు, ఇతరులు నదిలోకి వెళ్లవద్దని హెచ్చరిక జారీ చేశారు. మద్దూరు లంక భూములు, కాసరనేనివారిపాలెం శివాలయం అంచుకు నీరు చేరింది. రేపటికి మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులకు సమాచారం అందింది.



కాసరనేనివారిపాలెం శివాలయం అంచుకు చేరిన వరద నీరు

రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

కానూరు, న్యూస్‌టుడే: రొమ్ముక్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని అమెరికన్ ఆంకాలజీ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ తేజస్విని అన్నారు. ఆదివారం రూట్స్ ఫౌండేషన్ నేతృత్వంలో అశోక్‌నగర్‌లోని సోమనాథ్ ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొమ్ములో వాపు ఉన్నా, గడ్డలు ఉన్నా, నొప్పి ఉన్నా, ఇతర మార్పులు గమనించినా తక్షణమే వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. రూట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ పోలవరపు విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ తొలిదశలోనే గుర్తిస్తే నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం అవసరమైన మహిళలకు మోమోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శర్మ, యలమండియ్య, వెంకటరమణ, మురళీకృష్ణ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తేజస్విని

రైతు బజారులో మెరక పనులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు రైతు బజారు ఆవరణలో మెరక పనులు ఆదివారం ప్రారంభించారు. రైతుబజారు ప్రాంగణం పల్లంగా నెలకొంది. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతుంది. బురద మయంగా ఏర్పడటంతో రైతులు వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైతు బజారులో రాయితీ టమాట స్టాల్‌ను వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత శనివారం పరిశీలించారు. ఇక్కడ ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు, వినియోగదారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి అధికారులు మెరక వేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆదివారం రెండు లారీల క్వారీ డస్ట్ పంపించారు. ఈ పనులను రైతు బజార్ ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



క్వారీ డస్ట్‌ను సర్దుతున్న సిబ్బంది

విద్యుత్తు వెలుగులు

ఈనాడు కథనానికి స్పందన

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై విద్యుత్తు దీపాలు ఎట్టకేలకు వెలిగాయి. గత కొన్ని వారాలుగా దీపాలు వెలగక పోవడంతో ప్రధాన మార్గంతో పాటు, సర్వీసు రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై 'జాతీయ రహదారిపై చిమ్మ చీకట్లు' శీర్షికన ఈ నెల 19న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టి, వీధి దీపాలను వెలిగించారు.



'తానా' ఆధ్వర్యంలో వైద్య, సామాజిక సేవలు

పెనమలూరు: అమెరికాలో స్థిరపడ్డా స్వగ్రామానికి వచ్చిన ప్రతిసారీ గ్రామానికి సేవా కార్యక్రమాలను అందిస్తూనే ఉంటానని తానా ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ మల్లినేని ఠాగూర్ తెలిపారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యాన పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహణతో పాటు గ్రామ రైతులకు పవర్ స్ప్రేయర్లు, రక్షణ పరికరాలు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని దాదాపు 400 మంది పేదలు సద్వినియోగం చేసుకొన్నారు. ఇందులో అవసరమైన వారికి ఈనెల 7 వ తేదీన ఉయ్యూరు రోటరీ క్లబ్ కంటి ఆసుపత్రి లో శస్త్రచికిత్సలను నిర్వహించనున్నట్లు తానా ప్రతినిధి ఠాగూర్ పేర్కొన్నారు. పెనమలూరు ఎన్నారై సంఘ ప్రతినిధులు పాలడుగు సుధీర్, ప్రవీణ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న ఠాగూర్, తానా ప్రతినిధులు



కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీమౌనిక తదితరులు

పవర్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం మండలం కేసరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. సర్పంచి లక్ష్మీమౌనిక, మాజీ ఎంపీపీ పొట్లూరి బసవరావు అసోసియేషన్ ప్రతినిధులు ప్రారంభించారు. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఏర్పాట్లను పీడీ శ్రీదేవి పర్యవేక్షించారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : హనుమాన్‌జంక్షన్ ఎస్సైగా వెలుగుల సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న ఈయన్ను ఇటీవల కృష్ణాజిల్లాకు కేటాయించారు. ప్రస్తుత హనుమాన్‌జంక్షన్ ఎస్సై ఏడీఎల్ జనార్దన్‌ను గన్నవరం బదిలీ చేయడంతో.. ఆయన స్థానంలో సురేష్‌ని నియమించారు. 2012 బ్యాచ్‌కు చెందిన సురేష్ గతంలో కాకినాడ, మండపేట, పెద్దాపురం, గండేపల్లి, తదితర పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

వైభవంగా గ్రామోత్సవం

చోడవరం(పెనమలూరు), న్యూస్‌టుడే: చోడవరంలో ఆదివారం కుంతీదేవి మహోత్సవం, జాతరలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామం పాడిపంటలతో తులతూగాలని, సుభిక్షంగా ఉండాలని భక్తులు వేకువజాము నుంచే కుంతీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. అనంతరం విగ్రహాన్ని ఎడ్లబండిపై మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల నుంచి ఊరేగింపు నిర్వహించారు. విగ్రహాన్ని పసుపు తోటలో ప్రతిష్ఠించడంతో క్రతువు ముగిసింది.



విగ్రహాన్ని ఎడ్లబండిపై తీసుకువెళ్తున్న గ్రామస్థులు



చీకటి పడితే చింతే..!

తాడిగడప పురపాలిక పరిధిలో పోరంకి వేదపాఠశాల ఎదురు నుంచి పెనమలూరు సెంటర్ వరకు బందరు రోడ్డుపై రాత్రి అంధకారం అలముకుంటోంది. రోడ్డు విస్తరణలో భాగంగా వేద పాఠశాల ఎదురుగా ఉన్న ప్రదేశం వరకు గతంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి ఇంకా సెంట్రల్ లైటింగ్ వేయలేదు. రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో ఉన్న విద్యుత్ స్తంభాలు కూడా కొన్ని ప్రాంతాలలో తొలగించారు. ఆ ప్రాంతాలలోనూ దీపాల్లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. **–న్యూస్‌టుడే, కానూరు**



ఇప్పటికీ పొలంలోనే నీళ్లు

సాగుకు దూరం.. రైతుకు భారం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : గత నెలలో సంభవించిన భారీ వర్షాలకు బాపులపాడు మండలం ఓగిరాల గ్రామం తీవ్ర స్థాయిలో ముంపునకు గురైంది. దాదాపు 15 రోజుల పాటు మోకాళ్లోతు నీరు నిలిచాయి. గ్రామస్థులను పునరావాస శిబిరాలకు తరలించారు. ఖరీఫ్ వరి పొలాలు ముంపు బారినపడి దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఇలా గడ్డితో మేటవేసుకుపోయి, నీళ్లు నిలిచి కన్పిస్తున్నాయి.

కూటమితోనే గ్రామాల్లో వెలుగులు



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో వెలుగులు సాధ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం మండలంలోని తెంపల్లి, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, గొల్లనపల్లి, మాదలవారిగూడెం, సూరంపల్లి, ముస్తాబాద, పురుషోత్తపట్నం, వీఎన్‌పురం కాలనీ, గన్నవరం, దావాజీగూడెం, అజ్జంపూడి, బుద్ధవరం, కేసరపల్లి, జక్కులనెక్కలం గ్రామాల్లో రూ.6.12కోట్లతో నిర్మించనున్న సీసీ, బీటీ రోడ్లకు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం పలువురు స్థానిక సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వర్ణలత, తెదేపా నాయకులు, తెలుగు మహిళలు, యువత పాల్గొన్నారు.

సాంకేతికతతో మెరుగైన వైద్యం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధి చిన్నఅవుటపల్లి డా.పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో రక్తం, మూల కణజాలాల మార్పిడిపై రెండ్రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక కార్యశాల ఆదివారం ముగిసింది. ఇండియన్ సొసైటీ ఆఫ్ ట్రాన్స్‌మిషన్ మెడిసన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యశాలకు కళాశాల డీజీ చదలవాడ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్త మార్పిడి, అనుబంధ వైద్య విభాగాల్లో నేడు అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిందన్నారు. వైద్యులు అందరూ ఈ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని మెరుగైన సేవలకు కృషి చేయాలని సూచించారు. మెరుగైన వైద్య చికిత్స కృషిచేస్తున్నట్లు ప్రిన్సిపల్ మేజర్ డా.భీమేశ్వరరావు తెలిపారు. పాథాలజీ విభాగాధిపతి నవీన్‌చంద్ర, డా.దేవాశిష్‌మిశ్రా ఎయిమ్స్ భువనేశ్వర్, డా.చైతన్యకుమార్ ఎయిమ్స్ మంగళగిరి, డా.వై.వర్దన్, డా.అమర్‌నాథ్ పోలిశెట్టి, డా.రంజిత, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ ప్రొఫెసర్ డా.జాస్మిన్‌సుల్తానా, పాథాలజీ ప్రొఫెసర్లు కల్యాణ చక్రవర్తి, శ్రీకాంత్ పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్య బృందంతో చదలవాడ నాగేశ్వరరావు తదితరులు

ఉచిత వైద్య శిబిరం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధి సూరంపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో విజయవాడ డా.ఎమ్‌జే.నాయుడు ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరానికి స్పందన లభించింది. బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె, మెదడు, ఎముకలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 200ల మందికి సేవలు అందించారు. ఆసుపత్రి గౌరవ అధ్యక్షులు వావిలాల రజనీకాంత్‌శర్మ పర్యవేక్షించారు.



ఆకట్టుకున్న కోలాటం

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల రథోత్సవంలో గన్నవరం పట్టణానికి చెందిన లక్ష్మీతిరుపతమ్మ తల్లి మాతృమండలి కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. సమాజం కోలాటం మాస్టర్ చిట్టూరి వీరవెంకట వేణుగోపాలస్వామి(గోపి) పర్యవేక్షించారు. **- గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే**

లక్ష్మణరావు విజయానికి కృషి చేయాలి

ఉయ్యూరు: కృష్ణా, గుంటూరు నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో పీడీఎఫ్ నుంచి పోటీ చేస్తున్న కె.లక్ష్మణరావు విజయానికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తెలిపారు. ఉయ్యూరులోని నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకిరామయ్య విజ్ఞాన కేంద్రంలో 'గ్రాడ్యుయేట్ ఎన్నికలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి' అనే అంశం పై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారిని ఓటర్లుగా చేర్చడంలో చొరవ చూపాలని కోరారు. సాధారణ ఓటు లేకపోయిన గ్రాడ్యుయేట్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా బాధ్యుడు పీవీ రమణ, హబీబ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, శివనాగేంద్రం, అన్నే సుబ్బారావు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహారావు

కాపలాదారు ఆత్మహత్య

పెనమలూరు, న్యూస్‌టుడే: తాడిగడప వందడుగుల రహదారి లోని ఓ అపార్ట్‌మెంట్ కాపలాదారు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్నాల శ్రీను (28) స్థానిక కమలా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో కాపలాదారుగా పనిచేస్తున్నాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. దీంతో తరచూ భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకునేది. ఆదివారం ఆయు నారాయణపురం కాలనీలోని అత్తమామల వద్దకు వెళ్లింది. మధ్యాహ్నం అపార్ట్‌మెంట్‌వాసులు ఆమెకు ఫోన్ చేసి శ్రీను గదిలో ఉరేసుకొని మృతి చెందినట్లు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద స్థితిలో మృతిగా పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు డ్రైవర్ అదృశ్యం

పెనమలూరు, న్యూస్‌టుడే: ఓ కారు డ్రైవర్ అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గోవాడ అనిల్‌కుమార్ గోసాల వైకుంఠపురం నివాసి. మద్యం తాగిన కారణంగా ఈ నెల 16వ తేదీన భార్య నాగమణి మందలించింది. ఆ మరుసటి రోజు ఉదయం డ్యూటీకి వెళ్తున్నట్లు ఇంట్లో తెలిపి బయటకు వచ్చిన అతడు తిరిగి చేరుకోలేదు. మూడ్రోజులైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కానూరులో వివాహిత..

పెనమలూరు: కానూరుకు చెందిన ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. ఈ నెల 18న ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త ఎంత ప్రయత్నించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మృతుడి ఆచూకీ లభ్యం

పెనమలూరు, న్యూస్‌టుడే: చోడవరం వద్ద కృష్ణానది లంకల్లో రెండ్రోజుల క్రితం లభ్యమైన వ్యక్తి మృతదేహం వివరాలు తెలిశాయి. మృతుడు విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన కె. దుర్గాశ్రీనివాస్‌గా పెనమలూరు పోలీసులు గుర్తించారు. ఇతను ఈనెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు ఈ నెల 16వ తేదీన నున్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. కేసును నున్న పోలీసులకు పెనమలూరు పోలీసులు బదిలీ చేశారు.

తమ్ముడిపై అన్న దాడి

పెనమలూరు, న్యూస్‌టుడే: తమ్ముడిపై అన్న దాడి చేసి కొట్టిన సంఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. .నూన్సావత్ కుమార్ యనమలకుదురు వైఎస్ఆర్ నగర్ నివాసి. అతడు వేదిక అలంకరణ పనులు చేస్తుంటాడు. అతడికి తన అన్న కోటేశ్వరరావుతో అప్పుపై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో శనివారం కోటేశ్వరరావు తన కుమారుడు కిరణ్‌కుమార్‌తో కలిసి కుమార్‌పై దాడి చేశాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు ఆదివారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

రామవరప్పాడు: విద్యుత్తు లైను మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నారు. ఎనికేపాడు మెయిన్ రోడ్డు, జెండా చెట్టు సెంటర్, విజయ ఆగ్రో కట్ట, హరిజనవాడ, రైల్వే కట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని ఏఈ పరమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు కడప జిల్లా రచయితల ఆహ్వానం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను 2025 జనవరిలో జరగనున్న వైఎస్సార్ కడప జిల్లా రచయితల మహాసభలకు రచయితలు ఆహ్వానించారు. ఆదివారం కడపలో పర్యటించిన బుద్ధప్రసాద్‌ను కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యంలు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. తెలుగు భాషకు నిరంతర సాహితీ సేవ చేస్తున్న బుద్ధప్రసాద్‌ను అభినందించారు. సంఘం గౌరవ సలహాదారు అలపర్తి పిచ్చయ్య చౌదరి, కోశాధికారి డాక్టర్ కొప్పోలు, రెడ్డి శేఖర్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ వెంకటేశ్వరాచారి పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వైఎస్సార్ కడపలో అమీన్ పీర్ దర్గాను దర్శించి ప్రార్థనలు చేశారు. దర్గాలో చాదర్‌ను సంప్రదాయబద్ధంగా తలపై పెట్టుకుని తీసుకెళ్లగా పెద్దలు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కూచిపూడి, న్యూస్‌టుడే: స్థానిక శ్రీసిద్ధేంద్ర ఓరియంటల్ జడ్పీ పాఠశాలలో 1984-85 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. రూ.2 లక్షలతో నిర్మించిన సైకిల్ షెడ్‌ను పాఠశాల పూర్వ విద్యార్థిని, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి, విశ్రాంత ఉపాధ్యాయులు జె.బి.టి. సుందరి(తెలుగు), కె.మార్కెండేయులు(సోషల్)లు ప్రారంభించారు. పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడిన అప్పటి పూర్వ విద్యార్థులు పాల్గొని గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆ పాఠశాల జూనియర్ అసిస్టెంట్ బదరీనారాయణ, చామర్తి వెంకటరమణ, హెచ్ఎం సత్యప్రసాద్ పాల్గొన్నారు.



సైకిల్ షెడ్ ప్రారంభోత్సవంలో ఉపాధ్యాయులు, హైకోర్టు జడ్జి జస్టిస్ కిరణ్మయి

140 మంది రోగులకు కంటి పరీక్షలు

కూచిపూడి, న్యూస్‌టుడే: మొవ్వ మండల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కాశీభొట్ల ఆనారాయణమూర్తి సహకారంతో సమత శంకర నేత్రాలయం(ఉయ్యూరు) వారిచే రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 140 మందికి పరీక్షలు చేశారు. శిబిరాన్ని కూచిపూడి ఎస్ఐ సుబ్రహ్మణ్యం ప్రారంభించగా.. డాక్టర్ తేజశ్వి, సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. 28 మందిని శుక్లం ఆపరేషన్‌లకు ఎంపిక చేయగా.. వీరికి ఉయ్యూరులో శస్త్ర చికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సొసైటీ ఛైర్మన్, జిల్లా శాఖ కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సంజీవని వైద్యాలయం ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోనేరు మంజునాథ్, సభ్యులు శ్రీరంగాచార్యులు, దండమూడి వంశీ, శ్రీకాకుళం శ్రీనివాసరావు, వి.రవి, కత్తిక రామాంజనేయులు, రెడ్‌క్రాస్ సభ్యులు గొరిపర్తి వెంకటరమణ, పావులూరి వెంకటేశ్వరరావు, పీఆర్వో పవన్ పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

గుడివాడ గ్రామీణం: మురికివాడల్లో పేదల ఆరోగ్య సంరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు ముందుకు వచ్చి మెగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు సహకారంతో అనూ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ వారిచే సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, తెదేపా నేతలు జగన్ మోహన్‌రావు, గుత్తా చంటి, మానవతా జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి, వ్యవస్థాపకుడు రమేష్, అధ్యక్షుడు గోపిరెడ్డి, సీతారామస్వామి, చంద్రశేఖర్, నిర్వాహకుడు రోహణ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో వైద్యులు, నిర్వాహకులు

భక్తితో లక్ష్మీ గణపతి హోమం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: సంకట హర చతుర్థి పురస్కరించుకుని శ్రీవిఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆదివారం శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. లోక కల్యాణార్థం ఈ క్రతువు నిర్వహించామని ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శాస్త్ర రాజేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి జాతర

పెదపారుపూడి న్యూస్‌టుడే: మండలంలోని యలమర్రు గ్రామ దేవత అయిన శ్రీఅంకమ్మతల్లి వార్షిక జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అమ్మ వారికి పూజలు చేశారు.

వైభవంగా సూర్యదేవుడి కల్యాణోత్సవం

వేకనూరు(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: వేకనూరులోని ఉషాపద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం సూర్యదేవుడి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ బాబూ నాయక్ ఆదివారం స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమశాఖ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో 80 మందికిపైగా విద్యార్థినులు ఉండగా వారికి గదులు సరిపోవడంలేదని గుర్తించారు. మోడల్ హాస్టల్‌ను సందర్శించి పరిశీలించగా పలు సమస్యలను గుర్తించారు. ఆయన వెంట న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రఘురామ్‌ప్రసాద్, ఏపీపీ సీహెచ్.ప్రసాద్, ఏజీపీ ఎన్.ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయ విజయభాస్కర్‌కు పురస్కారం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన వెంకట విజయభాస్కర్.. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డు-2024కు ఎంపికయ్యారు. రాష్ట్ర లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎల్ లక్ష్మణరావు, అతిథుల నుంచి విజయభాస్కర్ తరఫున ఆయన బంధువు ఈ అవార్డు అందుకున్నారు.

ఏసుబాబుకు అభినందన

పెదపారుపూడి న్యూస్‌టుడే: పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేస్తున్న కొలుసు ఏసుబాబును ఏపీ రాష్ట్ర టైపిస్ట్ అండ్ స్టెనోగ్రాఫర్స్ సహాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గుంటూరు జడ్పీ కార్యాలయంలో జరిగిన సంఘ ఎన్నికల్లో సభ్యులు ఏసుబాబు పేరు ప్రతిపాదించారు. పెదపారుపూడి మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఏసుబాబును అభినందించారు.

రహదారి పరిశుభ్రత పనులు

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పాత ఎడ్లంకలో ప్రధాన రహదారి ప్రక్షాళన పనులను జనసేన మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు ఆదివారం ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్లకంచను తొలగించడం, రహదారి పై ఏర్పడిన గుంతలను పూడ్చడం వంటి పనులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల మండలంలోని అన్ని గ్రామాల పట్టభద్రులకు ఓటు నమోదుకు ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు విజయప్రసాద్ ఆదివారం ప్రకటలో పేర్కొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి విరాళం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్న తెదేపా నాయకుడు సజ్జా చలపతిరావు చల్లపల్లిలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం ఇచ్చి హామీ నిలబెట్టుకున్నారు. ఇటీవల రూ.5 లక్షలను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌కు అందించగా.. మిగిలిన రూ.5లక్షలు ఆదివారం చల్లపల్లికి చెందిన డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతిల సమక్షంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు అందించారు. చల్లపల్లి సర్పంచి కృష్ణకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌తో దాత చలపతిరావు తదితరులు

వీడని వర్షం.. తీరని నష్టం

ముంపు బారిన పంటలు

అన్నదాతకు తప్పని కష్టాలు

నాగాయలంక, న్యూస్‌టుడే, కోడూరు(అవనిగడ్డ), న్యూస్‌టుడే

వాయుగుండం ప్రభావం అవనిగడ్డ నియోజకవర్గంపై తీవ్రంగా పడింది. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకుతమకు తీరని నష్టం వాటిల్లుతోందని అన్నదాతలు వాపోతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగాయలంక మండలంలోని తీర ప్రాంత భావదేవరపల్లి, కమ్మనమోలు, నాలి, బర్రంకుల, సొర్లగొంది, దీనదయాళపురం, పర్రచివర, గుల్లలమోద తదితర ప్రాంతాల్లో 1,500లకు పైగా ఎకరాల్లో వరి పైరు నీట మునిగింది. గత వైకాపా ప్రభుత్వంలో డ్రెయినేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేయడంతో వర్షపు నీరు పొలాల నుంచి బయటకు పోవడం లేదని, అవుట్‌ఫాల్ స్లూయిస్ పనిచేయకపోవడంతో సముద్రపు నీరు పొలాల్లోకి ఎగదన్నుతోందని కర్షకులు గగ్గోలు పెడుతున్నారు.

ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి


గుల్లలమోద ప్రాంతాల్లో 15 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పొలాల్లో నీరు చేరి పంట దెబ్బతింది. ఇప్పటి రెండుసార్లు నాట్లు వేశా. ఎకరాకు రూ.25 వేలు ఖర్చు అయ్యింది. దెబ్బతిన్న పొలాలకు నష్ట పరిహారం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలి. **- విశ్వనాథపల్లి వెంకటేశ్వరావు, గుల్లలమోద**



కమ్మనమోలు ప్రాంతాల్లో మునిగిన వరి పైరు



మురుగు సమస్య పరిష్కరించాలి



10 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. గత మూడేళ్ల నుంచి వర్షపు నీటిలో పంట మునిగి అపార నష్టం వాటిల్లుతుంది. భారీ వర్షాలు సంభవించినప్పుడు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా ఇంజినీర్లతో శాశ్వతంగా ప్రణాళికలు రూపొందించి నిర్మాణాలు చేపట్టాలి. పొలాలను ముంపు నుంచి రక్షించాలి. **- సింగొతు వెంకటేశ్వరరావు, గుల్లలమోద**

వలసలే శరణ్యం



ఐదెకరాల్లో వ్యవసాయం చేస్తున్నా. నీరు లేక పంటలు ఎండి పోవడం లేదా అధిక వర్షాలకు నష్టం జరగడం తీర ప్రాంతాల్లో పరిపాటిగా మారింది. ఎక్కువగా వ్యవసాయం, చేపలవేట చేస్తూ జీవనం సాగిస్తున్నాం. చేపల వేట ఆశాజనకంగా లేదు. అటు వేట లేక, ఇటు పంటలు పండక వలసలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. **- పిత బాబూరావు, గుల్లలమోద**

మూడుసార్లు నాట్లు వేశాం



ఈ ఏడాది ఇప్పటి వరకు మూడు సార్లు నాట్లు వేశాం. మరో సారి నాట్లు వేసే పరిస్థితి తప్పదు. పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా వ్యవసాయం చేయాలో అయోమయంగా ఉంది. తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలి. **- మేడా శివాజీ, రైతు హంసలదీవి**

సాగు భారంగా మారింది



ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సాగు చేయడం మావల్ల కాదు. ఇప్పటికే అప్పులు చేసి రూ.వేలు పెట్టుబడి పెట్టి నారుమడులు పోశాం. వర్షాలు ఆగడం లేదు. పొలాల్లో నీరు బయటకు వెళ్లడం లేదు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపితేనే పంటలు దక్కుతాయి. **- దోవా బుల్లబ్బాయి, దింటిమెరక**



మల్లాయపాలెం: రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



యలమర్రు: శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



లక్ష్మీపురంలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మండలి వెంకట్రామ్, ఇతరులు

పల్లె పండగతో గ్రామాలకు మహర్దశ

గుడివాడ, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో పల్లె పండగ వారోత్సవాలు సందడిగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఆదివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అమలుతో పల్లెలకు దశ తిరిగిందని, సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. పెదపారుపూడి మండలం యలమర్రు, చినపారుపూడి, భూషణగుళ్ల గ్రామాల్లో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా భూమిపూజ చేశారు. మండలపార్టీ అధ్యక్షుడు రమేష్ చౌదరి, వెంకట సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు. గుడివాడ మండలం మల్లాయపాలెంలో రూ.1.47 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భూమి పూజ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మురళీ, ఎంపీడీవో ప్రసాద్, ఏఈ సూరిబాబు, తెదేపా నేతలు జగన్‌మోహన్‌రావు, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు. పామర్రు మండలం జమీగొల్వేపల్లిలో రూ.15.2 లక్షలు ఉపాధి నిధులతో రెండు రోడ్లకు సర్పంచి శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యుడు అరవింద్‌బాబు, మాజీ సర్పంచి వెంకటరత్నంలు భూమిపూజ చేశారు. కొండిపర్రులో రూ.25.80 లక్షలతో చేపట్టిన నాలుగు రోడ్లకు ఉప సర్పంచి రుక్మిణి, వీరాంజనేయులు తదితరులు, రిమ్మనపూడిలో ఐదు రోడ్లకు సర్పంచి దామోదరరావు, అడ్డాడలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీకి ఎంపీపీ అశోక్‌కుమార్ శంకుస్థాపన చేశారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో ఉపాధి హామీ నిధులు రూ.85.65లక్షలతో నిర్మించనున్న 18 సీసీ రోడ్లకు, కొత్తపేటలో రెండు సిమెంటు రహదారులకు, అవనిగడ్డ మండలం రామకోటిపురం పంచాయతీలో రూ.7లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లకు మండలి వెంకట్రామ్ భూమిపూజ చేశారు. ★ నందివాడ మండలం జొన్నపాడు, పొనుకుమాడు, గండేపూడిలలో రూ. 70 లక్షల నిధులతో చేపట్టనున్న రహదారుల నిర్మాణాలకు, గుడ్లవల్లేరు మండలం గుడ్లవల్లేరు, కౌతవరం, వెణుతురుమిల్లి, మామిడికోళ్లలో రోడ్లకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భూమిపూజ నిర్వహించారు. ★ మెరకనపల్లి గ్రామంలో రూ.18.2లక్షల వ్యయంతో గ్రామపంచాయతీలో నిర్మించే నాలుగు రహదారులకు ఆదివారం మండలి వెంకట్రామ్ భూమిపూజ చేశారు.

- న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం, పామర్రు గ్రామీణం, పెదపారుపూడి, అవనిగడ్డ, చల్లపల్లి, అవనిగడ్డ గ్రామీణం, మోపిదేవి, గుడ్లవల్లేరు



జమీగొల్వేపల్లిలో సర్పంచి, ఎంపీటీసీ, మాజీ సర్పంచులు



అడ్డాడలో ఎంపీపీ అశోక్‌కుమార్ తదితరులు



కొండిపర్రులో..

వాహన డ్రైవర్ల సమ్మెతో క్షీణించిన పారిశుద్ధ్యం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ పురపాలక సంఘంలో ఈ నెల 14వ తేదీ నుంచి చెత్త వాహనాలు నడిపే డ్రైవర్లు సమ్మెకు దిగడంతో 36 వార్డుల్లోనూ చెత్త సేకరణ ఆగిపోయింది. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ పేరుతో గత వైకాపా ప్రభుత్వం పురపాలక సంఘానికి 30 చెత్త వాహనాలు అందజేసింది. వీటితో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాల్సి ఉంది. కానీ గత మూడు నెలలుగా ఈ వాహనాలు నడిపే డ్రైవర్లకు ఏజెన్సీ వారు జీతాలు ఇవ్వలేదు. దీంతో వారు 14 నుంచి సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో గత వారం రోజులుగా వీధుల్లో చెత్త భారీగా పేరుకుపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని సత్యనారాయణపురం, శాంతినగర్, గుడ్‌మెన్‌పేట, రాజేంద్రనగర్, శ్రీరామపురం, పెద్దవీధి తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు, చెత్తను రోడ్ల పక్కన వేయడం, కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడం వల్ల చెత్త కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ సమస్యపై పురపాలక సహాయ కమిషనర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది రాష్ట్ర వ్యాపంగా ఉన్న సమస్య అని, అయినా ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న చెత్తను అద్దె ట్రాక్టర్లు ఏర్పాటు చేసి తరలిస్తున్నామన్నారు. వర్షం వల్ల కొంత ఇబ్బంది ఉందని, మిగిలిన ప్రాంతాల్లో కూడా చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

గుడివాడ గ్రామీణం: గుడివాడ పట్టణ పరిధిలో నూతన విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి 11 వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. పెద ఎరకపాడు, బేతవోలు, కార్మికనగర్, నిమ్మతోట, ఇందిరానగర్ కాలనీ, వాంబే కాలనీల్లో విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తారని తెలిపారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బల్లిపర్రు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంతో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తక్షణమే తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. స్థానిక బస్ షెల్టర్ వద్ద మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి వెంబడే మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో అతిసమీపంలో పాఠశాల పిల్లలకు, కళాశాలలు వెళ్లే యువతీ యువకులకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే మహిళలకు పలు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదేవిధంగా మందుబాబులు గొడవలకు దిగే ప్రమాదం ఉందన్నారు. దీనికితోడు ఆవాసాలు పక్కనే ఉండడంతో దొంగతనాలు జరిగేందుకు అవకాశం ప్రజలు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే ఈ విషయమై చొరవ తీసుకుని ఈ మద్యం దుకాణాన్ని వేరే చోటుకు తరలించాలని గ్రామ మహిళలు సునిత, వి.భానుమతి, టి.రాణి, టి.అనూష తదితరులు కోరుతున్నారు.

ఆర్యవైశ్య నూతన కార్యవర్గం ఎన్నిక

నాగాయలంక, న్యూస్‌టుడే: నాగాయలంక మండల ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షడి ఎన్నిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా చిట్టా శివ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చిట్టా వీర అన్నపూర్ణయ్య, కోశాధికారి కొల్లూరు రామకృష్ణ ఎన్నికయ్యారు. అలాగే ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షుడిగా టి.శేషుబాబు, ప్రధాన కార్యదర్శిగా వి.హరీష్, కోశాధికారిగా నారాయణ, వాసవీ సేవాదళ్ కన్వీనర్‌గా వి.రాజేష్, కో కన్వీనర్‌గా వెంకట శేఖర్‌రావు, కోఆర్డినేటర్‌గా ఎం.రాజగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాగసాయి శ్రీనివాస్ సమక్షంలో ఎన్నికల అధికారి జి.రాజా తదితరులు ఎన్నికలు నిర్వహించారు.

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరు మండల ఆర్యవైశ్య సంఘంలోని వివిధ విభాగాలకు ఆదివారం కార్యవర్గాలను ప్రకటించారు. స్థానిక శ్రీధానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరం వద్ద సంఘం మండల అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగశ్రీనివాసు ముఖ్య అతిథిగా పాల్గొని పర్యవేక్షించారు. జె.సుభాష్ చంద్రబోస్ మండల సంఘానికి అధ్యక్షుడిగా, బి.బోస్ ప్రధాన కార్యదర్శిగా, ఊరధన వెంకట నాగేంద్రరావు కోశాధికారిగా ఎన్నికయ్యారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా జె.రంగాదేవి ఎన్నికయ్యారు. వాసవి సేవాదళ్ కార్యవర్గ కన్వీనర్‌గా ఎ.సత్యనారాయణ, కో-కన్వీనర్‌గా ఎ.మల్లికార్జునరావు, కో-ఆర్డినేటర్‌గా డి.మల్లికార్జునరావు నియమితులయ్యారు. యువజన విభాగం అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎ.జగన్, కోశాధికారిగా వై.సాంబశివరావు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా శివరామకృష్ణ, బాలచంద్, నియమితులయ్యారు. కార్యక్రమంలో హరినాథబాబు, వెంకట సత్యనారాయణ, శివరామప్రసాద్, జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

ఘంటసాల, న్యూస్‌టుడే: పూషడం గ్రామ పంచాయతీ వద్ద సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరానికి విజయవాడ నుంచి హెల్ప్ హాస్పటల్ గుండె వైద్యనిపుణులు విచ్చేస్తారన్నారు. గుండె సంబంధ రోగులకు బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

తూములు పూడికతీత

దాలిపర్రు,(ఘంటసాల), న్యూస్‌టుడే: దాలిపర్రులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు ఎటూ వెళ్లకుండా రోడ్లపై నిలవడంతో పాటు ఇళ్ల ఆవరణలోకి చొచ్చుకొచ్చింది. ఆదివారం దాలిపర్రుకు చెందిన తెదేపా నాయకుడు మిక్కిలినేని మధు ఆధ్వర్యంలో రోడ్డు వెంబడి పూడుకుపోయిన పలు తూముల్లో పూడిక తీయించారు.

ఉచిత కంటి పరీక్షలు

నాగాయలంక, న్యూస్‌టుడే: స్థానిక మారుతీ విద్యానికేతన్ పాఠశాలలో కీర్తి శేషులు తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సహకారంతో సుదర్శి మానవతా సేవ సంస్థ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 80 మందికి కంటి వ్యాధులకు వైద్య నిపుణులు శ్రావణి వైద్య పరీక్షలు నిర్వహించి 53 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని శస్త్రచికిత్సల కోసం శంకర కంటి ఆసుపత్రి పెదకాకానికి ప్రత్యేక వాహనం ద్వారా పంపనున్నట్లు నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణలు తెలిపారు. శిబిరం ఇన్‌ఛార్జి గంగాధర్, రవి, సిబ్బంది పాల్గొన్నారు.


చదువు

■ e-mail: edc@eenadu.in

మన జీవన శైలి చురుగ్గా.. మెరుగ్గా!

పుస్తకం

మన జీవితాలు స్మార్ట్‌ఫోన్స్, సోషల్ మీడియా, వీడియో గేమ్స్‌తో నిండిపోతున్నాయి. ఇవి సంతోషాన్ని కలిగిస్తున్నట్లు అనిపించినా, చిక్కులనూ తెస్తున్నాయి. వీటి కారణంగా ఏకాగ్రత, క్రమశిక్షణ, పని తీరు తగ్గిపోతాయి. ఈ నేపథ్యంలో తిబో మోరిస్ రాసిన 'డోపమైన్ డీటాక్స్' పుస్తకం మన దైనందిన జీవనశైలిని మారుస్తూ, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.



నాడీవ్యవస్థలో పారే జీవ రసాయనం (న్యూరో ట్రాన్స్‌మిటర్).. డోపమైన్. ఇది మెదడుకు రసాయన ప్రేరణలను పంపుతుంది. సంతోషం, సుఖం, ప్రేరణ, ఆశాభావం కలిగించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. మనకేదైనా మంచి అనుభవం కలిగినప్పుడు (ఇష్టమైన ఆహారం తిన్నప్పుడో, సోషల్ మీడియాలో నచ్చిన నోటిఫికేషన్ వచ్చినప్పుడో) మెదడు డోపమైన్‌ను విడుదల చేస్తుంది. ఇది ఆ అనుభవం పట్ల ఆకర్షితులను చేస్తుంది. కానీ, దీని దుష్ప్రభావం ఏమిటంటే- ఈ తక్షణానందం కోసం అలవాటు పడిపోతూ ముఖ్యమైన ఇతర అంశాలను విస్మరిస్తాం.

డోపమైన్ వ్యసనాలకు బానిసలుగా మారితే, అది నెమ్మదిగా మన జీవనశైలిని నాశనం చేస్తుంది. ఏకాగ్రత తగ్గిపోతుంది. క్రమంగా ఒత్తిడికి లోనవుతాము. ఈ సమస్యలను అధిగమించడానికి డీటాక్స్ (విషం చేరినచోట దాన్ని తొలగించడం) అవసరం.

ప్రధాన అంశాలు

1 క్షణిక ఆనందానుభూతులు మనకు ఎలా హాని చేస్తాయి అన్నది పుస్తకం మొదటి భాగంలో వివరంగా చర్చిస్తారు.

2 నిజ జీవితంలో ఒక సర్టిఫికేషన్ పొంది పది మంది మన్నన పొందాలంటే కొన్ని నెలల పాటు కష్టపడి పరీక్షలు రాయాలి. అదే ఒక వీడియోగేమ్‌లో విజయం సాధిస్తే ప్రపంచవ్యాప్తంగా ఆ ఆట ఆడే తోటి ఆటగాళ్ళు వేలల్లో మెచ్చుకుంటారు. వీడియోగేమ్ ఇంటర్ఫేస్ మనమేదో సాధించేశామనే భ్రమ కలిగిస్తూ మన ఖాతాలో లక్షల పాయింట్లు నింపుతుంది. అలా సులభంగా మన మనసుకు సాంత్వన కలిగి, క్షణికానందాన్ని ఈ డోపమైన్ వ్యసనాలు అందిస్తాయి.

3 వీడియో గేమ్ ఆడే బదులు వ్యాయామం, నడక, జాగింగ్ చేయమని రచయిత సూచిస్తారు.

4 ఈ పుస్తకంలో ఉన్న విధానాలు రోజువారీ జీవితంలో కొత్త శక్తిని అందిస్తాయి. ఉదాహరణకు ఆహార నియమాలు, వ్యాయామం, సమయ పాలన మీద దృష్టి పెట్టడం.

5 డీటాక్స్ ప్రక్రియను పునరావృతం చేస్తూ ఉంటే పాత అలవాట్లలో పడకుండా, కొత్తగా నేర్చుకున్న జీవిత విధానంలో ముందుకు సాగవచ్చు. ఈ పుస్తకం ఆ డీటాక్స్ ప్రోగ్రామ్‌ను ఎలా పునరావృతం చేయాలో వివరిస్తుంది.

డోపమైన్ డీటాక్స్ వల్ల మనసుకు విశ్రాంతి లభించి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. స్మార్ట్‌ఫోన్స్, ఇతర డిజిటల్ అంశాలకు దూరంగా ఉంటే ఏకాగ్రత పెరుగుతుంది. సాంకేతిక ప్రపంచంలో మనల్ని బంధిస్తున్న మానసిక వ్యసనాల నుంచి బయటపడడానికి ఈ పుస్తకం మార్గం చూపుతుంది.

– రహ్మాన్ & సంపత్

గృహాలు, కర్మాగారాలు, వాణిజ్య సముదాయాలు.. ఇలా అన్ని చోట్లా ఉపయోగించే.. వస్తువులు, పరికరాలు, యంత్రాలు, ఉపకరణాలు.. వీటికి ప్రాణం పోసేది డిజైనర్లే. ఈ రంగంలో ఆసక్తి ఉన్నవారు ఐఐటీలతోపాటు మేటి సంస్థలు అందించే డిజైన్ కోర్సుల్లో చేరవచ్చు. ఇందుకు యూసీడ్, సీడ్ దారి చూపుతాయి!

డిజైన్ కోర్సులకు.. సీడ్ దారి!



మనం ఉపయోగించే వస్తువు ఏదైనప్పటికీ నిర్ణీత ప్రమాణాల మేరకు రూపొందాలి. ఆకర్షణీయంగానూ, సౌకర్యవంతంగానూ ఉంటూనే నాణ్యతలో రాజీ లేకుండా తయారవ్వాలి. తక్కువ ఖర్చుతో ఎక్కువ మన్నిక వచ్చేలా మన్ననలు పొందాలి. ఇవన్నీ కుదరాలంటే సమర్థ డిజైనర్ల సేవలు తప్పనిసరి. డిజైన్ రంగంలో రాణించడానికి విశేష పరిజ్ఞానంతోపాటు సృజన కీలకం. ఇంటర్మీడియట్ విద్యార్హతతో యూజీ స్థాయిలో ఈ చదువులు మొదలవుతాయి. ఆ తర్వాత ఆసక్తి ఉంటే పీజీలో స్పెషలైజేషన్ ఎంచుకోవచ్చు. అనంతరం పీహెచ్‌డీతో అత్యున్నత స్థాయినీ అందుకోవచ్చు.

డిజైన్ కోర్సుల్లో చేరడానికి దేశంలో ఎన్నో సంస్థలు పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఐఐటీ బాంబే ఆధ్వర్యంలోని యూసీడ్, సీడ్ వీటిలో ముఖ్యమైనవి. యూజీ కోర్సులకు యూసీడ్, పీజీ కోసం సీడ్ రాయాలి. ఇందులో ప్రతిభతో ఐఐటీలు, జాతీయ స్థాయిలో మేటి సంస్థల్లో సీటు పొందవచ్చు. దేశవ్యాప్తంగా పలు సంస్థలు ఈ స్కోరుతో అవకాశం కల్పిస్తున్నాయి.

యూజీ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్ (యూసీడ్)

అర్హత: 2024లో ఇంటర్ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్స్, కామర్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్.. అన్ని గ్రూపులవాళ్లూ అర్హులే. మూడేళ్ల డిప్లొమా, రెండేళ్ల ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసుకున్న, చదువుతున్నవారికీ అవకాశం ఉంది. ఐఐటీ-గువాహటి కోర్సుల్లో చేరడానికి ఇంటర్ ఎంపీసీ తప్పనిసరి.

వయసు: అక్టోబరు 1, 2000 తర్వాత జన్మించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే అక్టోబరు 1, 1995 తర్వాత జన్మించినప్పటికీ అవకాశం ఉంటుంది.

పరీక్ష ఇలా..

ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో 300 మార్కులకు ఉంటుంది. వ్యవధి మూడు గంటలు. ఇందులో రెండు భాగాలు (ఎ, బి) ఉంటాయి.

పార్ట్-ఎ: ఈ విభాగానికి 200 మార్కులు. మొత్తం 57 ప్రశ్నలు. వ్యవధి రెండు గంటలు. పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో 3 సెక్షన్లు.

పార్ట్-బి: ఈ విభాగానికి 100 మార్కులు. వ్యవధి ఒక గంట. ఇందులో రెండు ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి డ్రాయింగ్ నైపుణ్యాలను పరిశీలిస్తారు. ప్రశ్న ఆన్‌లైన్‌లో కంప్యూటర్‌పై డిస్‌ప్లే అవుతుంది. సమాధానం (డ్రాయింగ్) జవాబు పత్రంపై రాయాలి.

సంస్థలు, సీట్లు

ఐఐటీ-బాంబే 37, ఐఐటీ-దిల్లీ 20, ఐఐటీ-గువాహటి 56, ఐఐటీ- హైదరాబాద్ 26, ఐఐటీ-రవుర్కెలా 20, ఐఐఐటీడీఎం-జబల్‌పూర్‌లో 66 ఉన్నాయి.

యూసీడ్ స్కోరుతోనే దేశవ్యాప్తంగా పలు ఇతర సంస్థలు సైతం ప్రవేశం కల్పిస్తున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్, డీవై పాటిల్ యూనివర్సిటీ, దిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ, జైన్, జేకేఎల్‌యూ, నిర్మా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విట్, లవ్ లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, శ్రేష్ఠ, గురుగోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ, వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్, విశ్వనికేతన్, మిట్, యూపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, సెప్ట్, అనంత్ నేషనల్ యూనివర్సిటీ …తదితర సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి.

పీజీ, పీహెచ్‌డీల్లోకి... సీడ్

డిజైన్‌లో యూజీ పూర్తిచేసుకున్న, చివరి సంవత్సరం కోర్సులు చదువుతున్న విద్యార్థులు పీజీ చదవడానికి, అలాగే పీజీవాళ్లు పీహెచ్‌డీలో చేరడానికి సీడ్ రాయాలి. ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ-బాంబే, దిల్లీ, గువాహటి, హైదరాబాద్, కాన్పూర్, ఐఐఐటీడీఎం- జబల్‌పూర్, కాంచీపురంలలో డిజైన్ పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి సీడ్ నిర్వహిస్తున్నారు. ఇదే స్కోరుతో పలు ఇతర సంస్థల్లోనూ పీజీ కోర్సుల్లో చేరవచ్చు.

ప్రశ్నపత్రం ఇలా

ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది. ఇందులో పార్ట్ ఎ, బి ఉంటాయి. తుది ఎంపికలో పార్ట్ ఏకు 25, పార్ట్ బీకి 75 శాతం వెయిటేజీ లభిస్తుంది.

పార్ట్-ఎ: ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. ఈ విభాగంలో న్యూమరికల్ ఆన్సర్ టైప్, మల్టిపుల్ సెలక్ట్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు వస్తాయి.

పార్ట్-బి: ప్రశ్నలు ఆన్‌లైన్‌లో కంప్యూటర్‌పై డిస్‌ప్లే అవుతాయి. వీటికి సమాధానాలు (డ్రాయింగ్స్) బుక్‌లెట్‌లో రాయాలి. ప్రతి ప్రశ్నకు 20 మార్కులు చొప్పున వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది.

అర్హత: గ్రాడ్యుయేట్లు ఎవరైనా దరఖాస్తు చేసుకవోవచ్చు. ప్రవేశం కల్పించే సంస్థల వారీ స్వల్ప వ్యత్యాసాలు ఉంటాయి. బీటెక్, బీఆర్క్, డిజైన్, ఇంటీరియర్ డిజైన్, బీఎఫ్ఏ వీటిలో ఏదైనా నాలుగేళ్ల కోర్సు లేదా జీడీ ఆర్ట్స్ డిప్లొమా ప్రోగ్రాం (10+5 విధానంలో) చదివినవారికి అన్ని సంస్థల్లోనూ అవకాశం ఉంటుంది. అభ్యర్థులు ఎన్నిసార్లైనా పరీక్ష రాసుకోవచ్చు. వయసు నిబంధన లేదు.

యూసీడ్, సీడ్ ముఖ్య తేదీలు

ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.2000. మిగిలిన అందరికీ రూ.4000

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబరు 31. రూ.500 ఫైన్‌తో నవంబరు 8. **పరీక్ష తేదీ:** జనవరి 19

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం

వెబ్‌సైట్లు: https://uceedapp.iitb.ac.in/UCEED/home.jsp
https://ceedapp.iitb.ac.in/CEED/home.jsp

బి.ఎ. తర్వాత ఏమేం అవకాశాలు?

బి.ఎ. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చేశాను. దీంతో ఏ ఉన్నత విద్యా ఉద్యోగావకాశాలుంటాయి? - **బి. చిట్టిబాబు**

■ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో గ్రాడ్యుయేషన్ చేసినవారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పరిశోధన, పరిపాలనకు సంబంధించిన వివిధ ఉద్యోగావకాశాలుంటాయి. ఈ సబ్జెక్ట్ చదివినవారు చాలామంది సివిల్ సర్వీసెస్, రాష్ట్ర స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ గ్రాడ్యుయేట్లు పాలసీ అనలిస్టులు, ఫీల్డ్ ఆఫీసర్లు, కన్సల్టెంట్లు లాంటి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. స్వచ్ఛంద సేవా సంస్థలు, యూఎన్‌డీపీ, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, యునెస్కో లాంటి అంతర్జాతీయ సంస్థలు, వివిధ కన్సల్టింగ్ సంస్థల్లో కొలువులు లభిస్తాయి. వీటితో పాటు ప్రభుత్వరంగ సంస్థలు, సామాజిక రంగాలు, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, మంత్రిత్వ శాఖల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, పబ్లిక్ పాలసీ, లా, జర్నలిజాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసే అవకాశం ఉంది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చేసిన తరువాత నెట్/ సెట్/ పీహెచ్‌డీతో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అధ్యాపక ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. ఆసక్తి ఉంటే డేటా అనాలిసిస్, డెవలప్‌మెంట్ స్టడీస్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ ఫైనాన్స్, కమ్యూనికేషన్ లాంటి వాటిలో స్వల్పకాలిక కోర్సులూ చేయవచ్చు. బోధన రంగంలో ఆసక్తి ఉంటే డీఈడీ, బీఈడీ చేయవచ్చు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ గ్రాడ్యుయేషన్‌తో డిగ్రీ అర్హత ఉన్న అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకూ దరఖాస్తు చేసుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

మనూలో బీఈడీ (ఓడీఎల్) ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ) 2024-25 విద్యా సంవత్సరానికి ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందిన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు అర్హులు.

బోధనా మాధ్యమం: ఉర్దూ. **ప్రోగ్రామ్ వ్యవధి:** రెండేళ్లు (4 సెమిస్టర్లు). **ప్రవేశ ప్రక్రియ:** ప్రవేశ పరీక్ష ఆధారంగా.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.1,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 30-10-2024. **ప్రవేశ పరీక్ష తేదీ:** 03-11-2024.

ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడి: 06-11-2024.

వెబ్‌సైట్: https://manuu.edu.in/

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్
డీప్‌థాట్ ఎడ్యుటెక్ వెంచర్స్‌లో

1. ఏఐ సైకాలజీ
నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.2,000
☛ internshala.com/i/bf0697

2. యూఎక్స్ రిసెర్చ్
నైపుణ్యం: యూఎక్స్ రిసెర్చ్
స్టైపెండ్: రూ.2,000
☛ internshala.com/i/b4736e

3. టీచింగ్
నైపుణ్యం: టీచింగ్
స్టైపెండ్: రూ.2,000
☛ internshala.com/i/16e2c4

4. కాపీరైటింగ్
నైపుణ్యం: కంటెంట్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.2,000
☛ internshala.com/i/9ded22

గేమ్ డెవలప్‌మెంట్
సంస్థ: లోహిటెక్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: యానిమేషన్, బ్లెండర్ 3డీ, సీ#, యూనిటీ 3డీ, యూనిటీ ఇంజిన్
స్టైపెండ్: రూ.8,000-10,000
☛ internshala.com/i/e4dff3

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: నవంబరు 16

రక్షణ సైన్యం.. కావాలి అభయం!

పోలీసులపై విధుల భారం
కూటమి ప్రభుత్వంపై ఆశలు
నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం

ఒత్తిడి 24 x 7

కొట్లాటలు.. కుమ్ములాటలు..
అత్యాచారాలు.. హత్యలు..
దొంగతనాలు.. దోపిడీలు..
రోడ్డు ప్రమాదాలు..
శాంతి భద్రతలు..
వీఐపీల రాకపోకలు
బహిరంగ సభలు.. సమావేశాలు
ధర్నాలు.. నిరసన కార్యక్రమాలు
పండగలు.. ప్రత్యేక వేడుకలు
ట్రాఫిక్ నియంత్రణ..
అర్ధరాత్రి గస్తీ..

... ఇలా రకరకాల విధులు, ఒత్తిళ్లతో పోలీసులు నలిగిపోతున్నారు. ప్రజారక్షణలో అవిశ్రాంత పోరాటం చేస్తున్నారు. ఉద్యోగ బాధ్యతల్లో వెసులుబాటు, ప్రయోజనాలు కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కరుణించి.. తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

ఎన్టీఆర్, కృష్ణాజిల్లా పోలీస్ స్టేషన్లలో సరిపడా పోలీసు సిబ్బంది లేరు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో స్టేషన్‌కు కనీసం 20 మంది అదనంగా కావాలి. ఈ 20 మంది పని.. ఉన్నవారిపైనే పడుతోంది. ఫలితంగా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. వీఐపీల బందోబస్తు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, నేరాలు.. తదితరాలతో విధులంటే భయపడిపోయే పరిస్థితులు వచ్చాయి. వీటన్నింటి నుంచి తమను కూటమి ప్రభుత్వం గట్టెక్కిస్తుందని ఆశతో ఉన్నారు. ప్రజలకు రక్షణగా ఉండే తమ శాఖపై దృష్టిసారించి, పరిష్కార మార్గాలు చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వారాంతపు సెలవు ఇవ్వరూ..

పోలీస్‌శాఖపై తమకు ఎంతో ప్రేమ ఉన్నట్లు గత వైకాపా ప్రభుత్వం వీక్లీ ఆఫ్‌లు ప్రకటించింది. గొప్పలు చెప్పుకొంది. మాటిచ్చి మడమ తిప్పింది. కొద్ది నెలల పాటే అమలు చేసి.. తర్వాత చేతులెత్తేసింది. వివిధ పనుల పేరిట సిబ్బందిపై పని ఒత్తిడి పెంచేసింది. ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టేందుకు వాడుకుంది. ప్రజలను, ప్రతిపక్షాలను వేధించేందుకే వినియోగించుకుంది. రకరకాల ఇబ్బందులకు గురిచేసింది. కూటమి ప్రభుత్వం స్పందించి వీక్లీ ఆఫ్‌లు అమలు చేస్తే.. తమకు ఉపశమనం కలుగుతుందని సిబ్బంది పేర్కొంటున్నారు.

రూ.కోట్లలో సరెండర్ లీవ్‌లు...

నిరంతరం విధులు నిర్వహించే పోలీసులకు ప్రభుత్వం.. ఏడాదికి ఒక నెల జీతం అదనంగా చెల్లిస్తుంది. విడతల వారీగా ఇస్తుంది. కానీ గత ప్రభుత్వం అన్నింటినీ బకాయిలు పెట్టింది. మూడు టర్మ్‌ల సరెండర్ లీవులు బకాయిలు ఉన్నాయి. ఇవి కేడర్‌ను బట్టి.. కానిస్టేబుల్ నుంచి సీపీ వరకు రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది.

కృష్ణా జిల్లాలో సిబ్బంది వివరాలు..

ఎస్పీ	1
అదనపు ఎస్పీ	0
డీఎస్పీలు	4
సీఐలు	31
ఎస్సైలు	85
ఏఎస్సైలు	117
హెడ్‌కానిస్టేబుళ్లు	328
కానిస్టేబుళ్లు	695
ఏఆర్ సిబ్బంది	496

టీఏ, డీఏలు పెండింగ్‌లోనే...

విధి నిర్వహణలో భాగంగా ప్రతి ఒక్కరూ గస్తీ తిరగాలి. దీని కోసం వీరికి నెలకు రూ.1,400లు టీఏగా చెల్లించేవారు. ఇతర ప్రాంతాలకు వెళితే డీఏ రోజుకు రూ.500ల నుంచి రూ.600ల వరకు చెల్లించేవారు. వైకాపా పాలనలో వీటికి మంగళం పాడారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉండడంతో.. పోలీసు సిబ్బంది తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడికి తమ కష్టాలు తెలుసని, సమస్యలు తీరతాయని అనేక మంది భావిస్తున్నారు. సరెండర్ లీవ్‌లు, టీఏ, డీఏలు చెల్లిస్తారని ఆశిస్తున్నారు.

అద్దె భవనాల్లో పోలీస్ స్టేషన్లు..

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్, కృష్ణా జిల్లాలోనూ పలు పోలీస్ స్టేషన్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గుణదల స్టేషన్‌ను అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. సత్యనారాయణపురంలో భవన నిర్మాణం పూర్తికాలేదు. సరిపడా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మహిళా సిబ్బందికి విశ్రాంతి గదులు లేవు. సకల సౌకర్యాలతో సొంత భవనాల్లో పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ఆరోగ్య భద్రత అమలు చేయరూ...

పోలీస్ సిబ్బందికి ప్రతి నెలా.. వారి జీతం నుంచి రూ.135లు ఆరోగ్య భద్రత నిమిత్తం కట్ చేసుకునే వారు. కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల వరకు ఆరోగ్య సేవలు ఉచితంగా అందించేవారు. వైకాపా పాలనలో దీనికి కొర్రీలు పెట్టారు. సిబ్బందికి రూ.2 లక్షలు, కుటుంబ సభ్యుల్లో ఒక్కొక్కరికి రూ.లక్ష విలువైన సేవలు మాత్రమే అందించారు. రూ.కోట్లలో బకాయిలు ఉండడంతో.. ప్రైవేటు ఆసుపత్రులు వైద్యం అందించేందుకు ముందుకు రావడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ సమస్యలపై దృష్టిసారించాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు. వాటిని పరిష్కరిస్తే.. రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామని చెబుతున్నారు. నూతన ప్రభుత్వం తమకు కొంగొత్త ఉత్తేజాన్ని అందిస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నామని పోలీసులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుల దుర్మరణం



ఫ్లైఓవర్ రైయిలింగ్ పైకి ఎక్కిన కారు

మరో ఇద్దరికి గాయాలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద పైవంతెనపై ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. చిల్లకల్లు ఎస్సై సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని బిళ్లపాడుకు చెందిన నిల్లా వెంకట నాగ మల్లికార్జునరావు, భార్య నిల్లా నాగలక్ష్మి, కుమారులు నిల్లా శ్రీకాంత్, చైతన్య ఫణికాంత్ రెండేళ్లుగా హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో నివసిస్తున్నారు. కుమారులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి విశాఖపట్నంలోని బంధువుల ఇంటికి కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు ఆదివారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం హైదరాబాద్ ప్రయాణమయ్యారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద జాతీయ రహదారిపై వారు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వచ్చిన మరో కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో నాగలక్ష్మి(56), పెద్దకుమారుడు శ్రీకాంత్(32) అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నకుమారుడు చైతన్య ఫణికాంత్, వెంకట నాగ మల్లికార్జునరావులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న శ్రీకాంత్ అందులోనే ఇరుక్కుపోయారు.





నాగలక్ష్మి, శ్రీకాంత్ (పాతచిత్రాలు)

ఆయన్ను బయటకు తీయడానికి పోలీసులు, స్థానికులు తీవ్రంగా శ్రమించారు. కారులో వెనుక సీటులో కూర్చున్న తల్లి కూడా మృతి చెందింది. ఎదురుగా వచ్చిన కారు వేగంగా ఢీకొట్టడంతో వీరి కారు ఫ్లైఓవర్‌పై రైయిలింగ్‌పైకి ఎక్కిందంటే ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఎదురుగా వచ్చిన కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో వారు సురక్షితంగా బయటపడ్డారు.

'మతతత్వ ప్రమాదంలో భారతదేశం'

కృష్ణలంక, న్యూస్‌టుడే: నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేసి లెనిన్ సిద్ధాంతాన్ని ఆచరించాలని న్యూదిల్లీ న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ అన్నారు. వీఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా వర్తమానంలో లెనిన్ ప్రాధాన్యత అనే అంశంపై ఆదివారం విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం భారతదేశం మతతత్వ ప్రమాదాన్ని తీవ్రంగా ఎదుర్కొంటోందని, సమాజాన్ని విభజించాలనేది భాజపా, ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యంగా ఉందని స్పష్టం చేశారు. ముస్లిం, మైనార్టీ, వామపక్ష భావజాలాన్ని అణచివేయాలనే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఇటువంటి వాటిని సైద్ధాంతికంగా, తాత్వికపరంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మత, సైద్ధాంతిక పరమైన దాడులను మార్క్సిస్ట్ విధానంలో కాకుండా ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పడం మన ముందున్న కర్తవ్యమని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. . లెనిన్ కేవలం రష్యా విప్లవనేత మాత్రమే కాదని, భారతదేశానికి స్వాతంత్ర్యం రావాలని కోరుకున్న అంతర్జాతీయ విప్లవకారుల్లో మొదటి వ్యక్తి అని గుర్తు చేశారు. ఆయన ఆదర్శంగా సోవియట్ యూనియన్‌ని తీర్చిదిద్ది భూమిని రైతుల పరం చేసి, పరిశ్రమలపై ఆధిపత్యాన్ని కార్మికులకు ఇచ్చారని గుర్తు చేశారు. సీపీఎం అగ్రనేత దివంగత సీతారాం ఏచూరిపై ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'ప్రియతమ నేతకు అక్షర నివాళి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, బి.తులసీదాస్, వై.వెంకటేశ్వరరావు, దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పురకాయస్థ, వేదికపై శ్రీనివాసరావు, బాబూరావు తదితరులు

రాజధానిలో ఘంటసాల విగ్రహం ఏర్పాటు చేయాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణం నేపథ్యంలో 25 అడుగుల ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఘంటసాల విగ్రహ సాధన కమిటీ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలుగు కళావాహిని, జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, కళాభారతి, వివిధ ఘంటసాల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కౌతా కళావేదికలో ఘంటసాల 13వ రాష్ట్ర మహాసభలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాజధాని పనులు ప్రారంభించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ మాదిరిగా రాజధానిలో స్వాతంత్ర్య సమర యోధులు, శాస్త్రవేత్తలు, కవులు, రచయితలు, కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. వేదిక కోకన్వీనర్ కె.వి.ప్రసాద్ మాట్లాడుతూ.. ఊరూరా ఘంటసాల సాంస్కృతికోద్యమం అంటే ఘంటసాల సినిమా పాటలే కాదన్నారు. కళలు, సైన్స్, వ్యాపారం ఈ మూడు కలిపితే త్రివేణిసంగమం అని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఘంటసాల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. ఎన్టీఆర్, ఘంటసాలకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని కోరారు. ఘంటసాల గత వైభవాన్ని పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని, రాజధానిలో ఘంటసాల మ్యూజియం ఏర్పాటు చేయాలని రాష్ట్ర సభల్లో తీర్మానించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల గాయకులతో నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. ఈ కార్యక్రమంలో శింగంశెట్టి చంద్రశేఖర్, డేవిడ్‌రాజు, పరుచూరి విజయలక్ష్మి, శ్యామ్‌ప్రసాద్, కారుమంచి రాజు, జయప్రభు, ఎం.శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి. పక్కన చిట్టిబాబు, శ్యామ్‌ప్రసాద్, ప్రసాద్ తదితరులు

తొలి వికెట్ నష్టానికి ఆంధ్రా పరుగులు 303

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా జట్టు తొలి వికెట్ నష్టానికి రేవంత్‌రెడ్డి (186), హర్షవర్ధన్‌రెడ్డి (149 నాటౌట్) భాగస్వామ్యంతో 303 పరుగులు చేసింది. మూలపాడులోని క్రికెట్ కాంప్లెక్స్‌లో కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ కోసం ఆదివారం ప్రారంభమైన అండర్-23 అంతర్ రాష్ట్ర మల్టీ డే (నాలుగు రోజుల) క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా ఆంధ్రా, మేఘాలయ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన మేఘాలయ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. తొలి ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 62 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 373 పరుగులతో కొనసాగుతోంది. జట్టులో హర్షవర్ధన్‌రెడ్డి (149), సుబ్రహ్మణ్యం (26) క్రీజ్‌లో కొనసాగుతున్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా ఔట్ ఫీల్డ్ తడిగా ఉండడంతో మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో తొలి రోజు 62 ఓవర్లు మాత్రమే ఆడారు.



రేవంత్‌రెడ్డి (186)



హర్ష వర్ధన్‌రెడ్డి (149 నాటౌట్)